

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 12-05-2025 | సంపుటి - 24 | సంచిక - 10 | రూ : 4 | పేజీలు: 8


## సరిహద్దు రాష్ట్రాల్లో ప్రశాంతత

- పంజాబ్, రాజస్థాన్, జమ్మూకశ్మీర్‌లో ఆగిన కాల్పులు

**మే 11, చండీగఢ్/ఫిరోజ్‌పుర్/శ్రీనగర్:** కాల్పుల మోత మోగిన సరిహద్దు ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రశాంతత కొనసాగుతోంది. కాల్పుల విరమణ జరిగినా శనివారం రాత్రి డ్రోన్లు, పేలుళ్లు, సైరన్ల మోతతో దద్దరిల్లిన జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో బ్లాక్ అవుట్ ఎత్తివేశారు. జమ్మూ నగరంలోనూ పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి తర్వాత పాక్ నుంచి డ్రోన్లు,

తరువాయి 2లో



## పాక్ వెన్నువిరిచిన బ్రహ్మోస్




- ఇస్లామాబాద్ సమీప నూర్ ఖాన్ సహా పలు వైమానిక స్థావరాలు క్షణాల్లో ధ్వంసం
- శత్రు సైన్యానికి వణుకు పుట్టించిన సూపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణి
- దెబ్బకు దిగి వచ్చి కాల్పుల విరమణకు అంగీకారం

**మే 11, హైదరాబాద్:** దిల్లీ: పాకిస్థాన్‌తో ఘర్షణ తీవ్రమవుతున్న పరిస్థితుల్లో భారత్ తీసుకున్న ఓ కీలక నిర్ణయం శత్రువు వెన్నువిరిచేలా చేసింది. తన అమ్ముల పొదిలోని బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణులను వ్యూహాత్మకంగా వినియోగించడంతో...అప్పటి వరకూ అణ్వాయుధాలున్నాయంటూ ప్రగల్బాలు పలికిన దాయాది దేశం వెన్నులో వణుకుపుట్టింది. మొత్తం పరిస్థితే మారిపోయింది. పాకిస్థాన్ అధికారిక రాజధాని ఇస్లామాబాద్ అయినా.. పాలన మొత్తం జరిగేది రావల్పిండి నుంచే. ఇక్కడ చక్లాలాలోని ఆ దేశ ఆర్మీ చీఫ్ కార్యాలయం నుంచే సైన్యానికి ఆదేశాలు వెళుతుంటాయి. శనివారం తెల్లవారుజామున భారత్ లక్ష్యంగా ఎంచుకున్న పాక్‌లోని కీలక ప్రాంతాల్లో రావల్పిండి సమీప నూర్ ఖాన్ వైమానిక స్థావరం అత్యంత ప్రధానమైనది.

తరువాయి 2లో

## అమరవీరుడికి కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో జవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు
- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ నివాళులు
- ప్రభుత్వం తరపున 5 ఎకరాల పొలం, రూ.50 లక్షలు, ఇంటి స్థలం, తండ్రికి ఉద్యోగం
- వ్యక్తిగతంగా పవన్ కల్యాణ్ రూ.25 లక్షల సాయం ప్రకటన



2లో



## టాప్ ర్యాంకర్లయినా.. స్థానికేతరులైతే సీట్లు రావు!

- పునర్విభజన చట్టం 'పదేళ్ల గడువు' పూర్తవడంతో ఏపీ విద్యార్థులకు 15% కోటా రద్దు
- ఏడేళ్లలో నాలుగేళ్లు రాష్ట్రంలో చదివి ఉంటేనే లోకల్ కోటా సీట్లు
- ఎప్‌సెట్‌లో ఈ ఏడాది నుంచే అమలులోకి..వైకాపా ప్రభుత్వం రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని ధ్వజం
- ఉరవకొండ నియోజకవర్గంలో పనుల పరిశీలన

**మే 11, హైదరాబాద్:** తెలంగాణ ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగంలో పలువురు ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించారు. అయితే విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు పూర్తయిన నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరం నుంచి అమలులోకి వస్తున్న కొత్త ఉత్తర్వుల ప్రకారం.. వీరు తెలంగాణలో కన్వీనర్ కోటాలో 15% సీట్లు పొందే అవకాశం లేదు. కన్వీనర్ కోటాలో 85 శాతం సీట్లను యథాతథంగా

తరువాయి 2లో

## నీరా.. సుందరీమణుల ఫిదా



- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**మే 11, హైదరాబాద్:** ప్రపంచ దేశాల సుందరీమణులు తెలంగాణ సంప్రదాయ పానీయం నీరా రుచి చూశారు. ప్రకృతి ప్రసాదించిన పోషకాల పానీయాన్ని ఇష్టంగా తాగారు. కొబ్బరినీళ్లలా భలేగా ఉన్నాయంటూ కితాబిచ్చారు. అలాగే దొన్నెల్లో అందించిన తాటి ముంజలను ఎలా వలుచుకోవాలో ఆసక్తిగా తెలుసుకుని ఆరగించారు. మిస్ వరల్డ్ 2025 పోటీలకు

తరువాయి 2లో

## ఇంజినీరింగ్‌లో 73.26%..

- అగ్రికల్చర్‌లో 87.82% ఉత్తీర్ణత నమోదు
- ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఇంజినీరింగ్‌లో తొలి పది ర్యాంకులు అబ్బాయిలకే... అగ్రికల్చర్‌లోనూ 9 కైవసం
- ఉత్తీర్ణతలో అమ్మాయిలే మెరుగు




2లో

## మన సైనిక సత్తా చాటాం

- సరిహద్దుల్లోనే కాదు.. రావల్పిండి వరకు వినిపించాం
- సిందూరం తుడిచేసిన వారిని శిక్షించాం
- ఆపరేషన్ సిందూర్‌పై రాజ్‌నాథ్
- అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించాం: వాయుసేన
- పాక్ అత్యాధునిక యుద్ధ విమానాలను నేలకూల్చాం
- కీలక యుద్ధ స్థావరాలను పేల్చేశాం
- రక్షణ శాఖ ప్రకటన
- కశ్మీర్‌పై పరిష్కారానికి పాటుపడతా: ట్రంప్
- సరిహద్దుల్లో ప్రశాంతత.. నేడు డీజీఎంవోల చర్చలు

**మే 11, దిల్లీ:** ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం తన పరాక్రమాన్ని ప్రదర్శించిందని, పాక్ సైనిక ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండిలోనూ గర్జించిందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి ద్వారా అనేక కుటుంబాల సిందూరాన్ని తుడిచేసినవారిని సైన్యం తగిన రీతిలో శిక్షించిందని చెప్పారు. ఇది కేవలం సైనిక చర్యే కాదని, ఉగ్రవాదంపై పోరులో భారత రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక సంకల్పానికి నిదర్శనమని చెప్పారు. ఉగ్రవాదులతోపాటు భారత వ్యతిరేక శక్తులపై మన సైన్యం ప్రతీకారం తీర్చుకుందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో

తరువాయి 2లో



# మన సైనిక సత్తా చాటాం...

సూపర్‌సోనిక్ బ్రహ్మోస్ ఉత్పత్తి, పరీక్షా కేంద్రాన్ని ఆదివారం ఆయన దిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించి ప్రసంగించారు. మరో వైపు సైనికాధికారులు, వైమానిక దళాధికారులు విలేకరులతో మాట్లాడుతూ పోరులో పాక్‌ను చావుదెబ్బ కొట్టామని, భారీనష్టం కలిగించామని ప్రకటించారు. సరిహద్దుల్లో శాంతి నెలకొనడం ఆదివారం పెద్ద ఊరట.

*** పాక్ స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నాం**

''ఉగ్రశక్తులకు భారత్ దీటుగా బదులిస్తుంది. ఉగ్రవాదంపై పోరులో మనకున్న దృఢ సంకల్పంతోపాటు మన సైనిక శక్తిసామర్థ్యాలను ఈ ఆపరేషన్ చాటిచెప్పింది. పహల్గాం బాధితులకు న్యాయం చేకూరింది. పాక్ ప్రజలపై భారత్ దాడి చేయలేదు. అక్కడి ఉగ్ర స్థావరాలను నాశనం చేయడమే ధ్యేయంగా ఆపరేషన్‌ను చేపట్టాం. దాయాది మాత్రం భారత పౌరులే లక్ష్యంగా మన దేశంపై దాడులు చేసింది. పౌర ప్రాంతాలు, ఆలయాలు సహా మతపరమైన ప్రదేశాలపైనా దాడులకు ప్రయత్నించింది. మన సైన్యం శౌర్య పరాక్రమాలను ప్రదర్శించడమే కాకుండా సంయమనాన్ని పాటించింది. భారత్‌లో ఉగ్రచర్యలకు పాల్పడితే పర్యవసానాలు ఎలా ఉంటాయనేది ప్రపంచమంతా చూసింది. ఇది సరికొత్త భారతదేశమని, ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు దీటైన జవాబును సరిహద్దుకు రెండువైపులా ఇస్తామని ప్రధాని మోదీ స్పష్టంచేశారు'' అని రాజ్‌నాథ్ చెప్పారు. ఉగ్రవాదంపై మనం చర్యలు తీసుకునేటప్పుడు ఉగ్రవాదులు, వారి పోషకులు దేశం అవతల ఉన్నా కూడా వారికి రక్షణ ఉండదని రుజువు చేశామని చెప్పారు. బ్రహ్మోస్ కేవలం ఆయుధం మాత్రమే కాదని.. అది సైనిక దళాల బలాన్ని, దేశ సరిహద్దుల్ని కాపాడుకునే సంకల్పాన్ని చాటే సందేశమని చెప్పారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ క్షిపణులను భారత్ ఉపయోగించిందని వెల్లడించారు. ఈ క్షిపణులకున్న శక్తి ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. దీని ప్రభావం గురించి తెలియని వారెవరైనా ఉంటే.. పాకిస్థాన్‌ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఉగ్రవాదం అనేది కుక్కతోక లాంటిదని.. దానిని సరిచేయాలంటే వారి సొంత భాషలోనే బదులివ్వాలని పేర్కొన్నారు.

*** కశ్మీర్‌పై కలిసి పనిచేద్దాం: అమెరికా**

భారత్‌పాకిస్థాన్ దేశాలతో కలిసి కశ్మీర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. సంఘర్షణతో మరణాలు, విధ్వంసం తప్ప ఏమీ ఉండదనేది రెండు దేశాల నాయకత్వాలు అర్థం చేసుకున్నందుకు గర్వంగా ఉందని 'ట్రూత్ సోషల్' మాధ్యమంలో ఆయన వ్యాఖ్యానించారు. 'ఘర్షణలు ఇంకా కొనసాగి ఉంటే లక్షలమంది అమాయక ప్రజలు చనిపోవచ్చు. కాల్పుల విరమణపై చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవడానికి అమెరికా సాయం చేసినందుకు నాకు గర్వంగా ఉంది. మీ రెండు దేశాల నాయకత్వాలకు దైవం ఆశీస్సులు ఉంటాయి. మనం కేవలం చర్చలు జరపడమే కాదు.. రెండు దేశాలతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకుందాం. ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న కశ్మీర్ విషయంలో పరిష్కారాన్ని అన్వేషించేందుకు మీతో కలిసి పనిచేస్తా' అంటూ పోస్ట్ చేశారు. ట్రంప్ తన తొలివిడత పాలనలో కూడా కశ్మీర్ విషయంలో జోక్యం చేసుకోవాలని అనుకున్నారు. అప్పటి భారత్, పాకిస్థాన్ ప్రధానుల వద్ద దానిగురించి ప్రస్తావించారు. తృతీయ పక్షం జోక్యాన్ని భారత్ తిరస్కరించింది. ఇప్పుడు మరోసారి ప్రతిపాదించారు. కశ్మీర్ వివాద పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ట్రంప్ చెప్పడాన్ని పాక్ ఆహ్వానించింది.

*** డోభాల్‌తో మాట్లాడిన చైనా విదేశాంగ మంత్రి**

విభేదాలన్నింటినీ భారత్‌పాక్‌లు చర్చల ద్వారా పరిష్కరించుకుని, దీర్ఘ కాలం పాటు కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటాయని చైనా ఆకాంక్షించింది. రెండు దేశాల ప్రాథమిక ప్రయోజనాల పరిరక్షణకు, అంతర్జాతీయ సమాజ ఆకాంక్షలు నెరవేరడానికి ఇది అవసరమని పేర్కొంది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ ఆదివారం భారత జాతీయ భద్రతా సలహాదారుడు అజీత్ డోభాల్‌తో మాట్లాడారు. రెండుదేశాలూ సంయమనంతో వ్యవహరిస్తూ చర్చలు, సంప్రదింపుల ద్వారా విభేదాలను పరిష్కరించుకుంటాయని వాంగ్‌యీ ఆశాభావం వ్యక్తంచేశారు. భారత్, పాక్‌లు రెండూ తమకు సరిహద్దు దేశాలేనని గుర్తుచేశారు. పహల్గాం ఘటన సహా అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని చైనా వ్యతిరేకిస్తుందన్నారు. యుద్ధం చేయడానికి తాము అనుకూలం కాదని, పహల్గాం దాడిలో వాటిల్లిన ప్రాణనష్టం తర్వాత ఉగ్రవాదులపై పోరాడాల్సి వచ్చిందని డోభాల్ ఈ సందర్భంగా చెప్పారు. పాక్ ప్రధాని షెహబాజ్‌తోనూ వాంగ్‌యీ మాట్లాడారు.

*** కాల్పుల విరమణ.. ఉద్రిక్తత తగ్గింపుపై భేటీ**

కాల్పుల విరమణ, అనంతర పరిస్థితిపై ఇరు దేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల 'సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్' (డీజీఎంవో)లు పాల్గొంటారు. కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్తత తగ్గించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

**ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష**

శనివారం రాత్రి పాక్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడిన తర్వాత తొలి సారిగా ప్రధాని మోదీ తర్వాత ఆదివారం తన నివాసంలో అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జైశంకర్, త్రివిధ దళాధిపతులతో సమీక్ష జరిపారు. సరిహద్దుల్లో తాజా పరిస్థితిని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్‌ఎస్‌ఏ) అజీత్ డోభాల్ వివరించారు.

**విరమణకు కట్టుబడి ఉన్నాం: పాక్**

భారత్‌తో కాల్పుల విరమణకు విశ్వాసపూర్వకంగా కట్టుబడి ఉన్నామని పాక్ తెలిపింది. తమ దళాలు బాధ్యత, సంయమనాలతో వ్యవహరిస్తున్నాయంది.

**చావు దెబ్బకొట్టాం**

''ఆపరేషన్ సిందూర్ ద్వారా సైనికంగా, రాజకీయంగా, మానసికంగా పాక్‌ను దెబ్బకొట్టాం. మన చేతిలో పాకిస్థాన్ ఓటమి పాలైంది. పాక్ వైమానిక స్థావరాలపై మనం దాడి చేయడంతో ఇక పోరాడలేమని దాయాది దేశం తెలుసుకుంది'' అని భారత విదేశీ వ్యవహారాల శాఖ మీడియాకు వివరించింది. భారత్ జరిపిన దాడుల్లో రహిమ్యార్‌ఖాన్ వైమానిక స్థావర రన్‌వే ధ్వంసమైనట్లు తెలిపింది. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిలేదని స్పష్టం చేసింది. ''బహావల్‌పుర్‌లోని జైషేమహ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రధాన కార్యాలయాన్ని నేలమట్టం చేశాం. బహావల్‌పుర్‌తోపాటు మురీద్కే, ముజఫర్‌బాద్ ఉగ్రవాద కేంద్రాలను నేలమట్టం చేశాం. ఈ నెల 10న పాకిస్థాన్ దాడికి ప్రతిస్పందనగా అగ్ని వర్షం కురిపించాం. మొత్తం 8 స్థావరాలు లక్ష్యంగా దాడులు చేశాం'' అని తెలిపింది. 'కశ్మీర్ విషయంలో మనకు స్పష్టమైన వైఖరి ఉంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను మన దేశానికి అప్పగించడం మినహా మరో విషయం లేదు. ఉగ్రవాదుల అప్పగింతపై వాళ్లు మాట్లాడితే మేమూ మాట్లాడతాం. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదు' అని తెలిపింది. అణుయుద్ధం వరకు ఏ దశలోనూ వెళ్లలేదని స్పష్టంచేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌కు తిరిగి అప్పగించడం గురించి తప్పిస్తే కశ్మీర్ అంశంలో పాక్‌తో ఎలాంటి చర్చలు ఉండవని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కశ్మీర్ అంశంలో ఎవరి మధ్యవర్తిత్వమూ అవసరం లేదని తేల్చిచెప్పాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం కొనసాగినన్నాళ్లూ సింధూ జలాల ఒప్పందం నిలిచిపోతుందని తెలిపాయి.

# టాప్ ర్యాంకర్లయినా.. స్థానికేతరులైతే సీట్లు రావు!

(మొదటిపేజీ తరువాయి)

స్థానికులకే కేటాయిస్తుండగా... మిగిలిన 15 శాతం స్థానికేతర కోటా సీట్లను కూడా తెలంగాణ మూలాలున్న కుటుంబాల్లోని విద్యార్థులకు మాత్రమే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అంటే తెలంగాణకు చెంది ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉంటున్నవారు, ఇతర రాష్ట్రాల వారై ఉండి... తెలంగాణలో 'స్థానిక' అర్హత లేకపోయినా.. వారి తల్లి లేదా తండ్రి ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నట్లయితే.. ఆ విద్యార్థులు 15 శాతం నాన్ లోకల్ కోటా కింద సీట్లు పొందటానికి అర్హులు. గత పదేళ్లలో ఏటా 15 శాతం కోటాలో 3,500 నుంచి 4 వేల సీట్లలో ఏపీ విద్యార్థులు చేరేవారు. ఈసారి ఆ అవకాశం లేకపోవడంతో తెలంగాణ విద్యార్థులకు ఆ మేరకు ప్రయోజనం కలగనుంది. దానివల్ల ఈసారి ప్రముఖ కళాశాలల్లో కటాఫ్ ర్యాంకు కొంత పెరగవచ్చని భావిస్తున్నారు.

*** హైదరాబాద్‌లో ఇంటర్ చదివినా.. చేరలేరు..**

రాష్ట్రంలో స్థానిక కన్వీనర్ కోటాలో సీటు పొందాలంటే 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు... అంటే ఏడేళ్లలో నాలుగేళ్లు తెలంగాణలో చదివి ఉండాలి. ఉదాహరణకు ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు (లేదా) 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివిన వారిని స్థానికులుగా పరిగణిస్తారు. అయితే హైదరాబాద్‌లో పలు కార్పొరేట్ కళాశాలలు ఉండటంతో అనేక మంది ఏపీ విద్యార్థులు సొంత రాష్ట్రంలో పదో తరగతి వరకూ చదివి... ఇంటర్‌మీడియట్‌ను నగరంలో చదువుతున్నారు. ఇక్కడ వారు రెండేళ్లు మాత్రమే చదివినందున వారిని స్థానికేతరులుగానే పరిగణిస్తారు. వారు టాప్‌ర్యాంకులు సాధించినా తెలంగాణలో కన్వీనర్ కోటా సీటు పొందలేరని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. విజయవాడలోని కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న వందల మంది విద్యార్థులు సైతం సమీపంలోని కోదాడ, సత్తుపల్లిలో తెలంగాణ ఎప్‌సెట్ రాశారు. ఇతర బోర్డుల నుంచి అని దరఖాస్తు చేసి... పరీక్ష రాశారు. వారిలో అనేక మందికి ఉత్తమ ర్యాంకులు దక్కాయి. అయినా వారు ప్రవేశాలు పొందటానికి అర్హులు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వాస్తవానికి వీరంతా ప్రాక్టీస్ కోసమే ఈ పరీక్షలు రాస్తుంటారని నిపుణులు చెబుతున్నారు.

*** గతంలోనూ టాప్ ర్యాంకర్లు.. ఇక్కడ చేరడం తక్కువే**

ఎప్‌సెట్‌లోని ఉత్తమ ర్యాంకర్లు దాదాపు అందరూ జేఈఈ మెయిన్‌లోనూ మంచి ర్యాంకులు సాధించిన వారే కావడం గమనార్హం. ఉదాహరణకు ఇంజినీరింగ్‌లో 2వ ర్యాంకర్ రామచరణ్‌రెడ్డికి జేఈఈ మెయిన్‌లో 53వ ర్యాంకు దక్కింది. మూడో ర్యాంకర్ హేమసాయి సూర్యకార్తీక్ మెయిన్‌లో 75వ ర్యాంకు సాధించాడు. వారు ఈ నెల 18వ తేదీన జరిగే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సన్నద్ధమవుతున్నారు. దాన్ని బట్టి వారు ఐఐటీలు లేదా టాప్ ఎన్‌ఐటీల్లో ప్రవేశాలు పొందుతారు. ఏపీ విద్యార్థులే కాదు... ఎప్‌సెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన తెలంగాణ విద్యార్థుల్లో సైతం రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరేవాళ్లను వేళ్లపై లెక్కపెట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# అమరవీరుడికి కన్నీటి వీడ్కోలు

ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని కశ్మీర్‌లో వీరమరణం పొందిన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన అగ్నివీర్ మురళీనాయక్‌కు ప్రజలు కన్నీటితో వీడ్కోలు పలికారు. తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థుల శోకసంద్రం మధ్య సైనిక లాంఛనాలతో ఆదివారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కళ్లితండాకు చేరుకుని మురళీనాయక్‌కు నివాళులు అర్పించారు. ఆయన తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మురళీనాయక్ చిన్నప్పటి నుంచే సైన్యంలో చేరతానని చెప్పేవాడని, జాతీయ జెండా కప్పుకొనే చనిపోతానని పదేపదే పేర్కొనేవాడని స్నేహితులు గుర్తు చేసుకున్నారు. అమరవీరుడికి నివాళి అర్పించేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వేలమంది తరలివచ్చారు.

**అన్ని విధాలుగా ఆదుకుంటాం**

మురళీనాయక్ కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. తల్లిదండ్రులకు మురళీనాయక్ ఏకైక సంతానం. ఆయన మరణంతో వారు ఒంటరిగా మిగిలిపోయారు. వారి కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.50 లక్షలు ఆర్థిక సాయం చేయనున్నట్లు ప్రకటించారు. 5 ఎకరాల పొలం, 300 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతోపాటు వ్యక్తిగతంగా తాను రూ.25 లక్షలు అందిస్తానని పవన్‌కల్యాణ్ ప్రకటించారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ మురళీనాయక్ తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్నారు. జిల్లా కేంద్రంలో జవాన్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు కళ్లితండాను మురళీనాయక్ తండాగా మారుస్తామని పేర్కొన్నారు. అంత్యక్రియలు నిర్వహించిన స్థలాన్ని స్మారకంగా తీర్చిదిద్దుతామన్నారు.

**ఏర్పాట్లను పర్యవేక్షించిన లోకేశ్**

ఆదివారం ఉదయం 8.30 గంటలకు మురళీనాయక్ స్వగ్రామం కళ్లితండాకు చేరుకున్న మంత్రి లోకేశ్ అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నారు. జవాన్ తల్లిదండ్రులు, బంధువులకు ధైర్యం చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు మురళీనాయక్.. స్నేహితుడు రాజశేఖర్‌తో జరిపిన వాట్సప్ సందేశాలను మంత్రి పరిశీలించారు. అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మురళీనాయక్ భౌతికకాయాన్ని స్వయంగా మోశారు. అంత్యక్రియల వద్ద వీరుడి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎం.ఎస్.రాజు, కందికుంట వెంకటప్రసాద్, దగ్గుబాటి ప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, కాలవ శ్రీనివాసులు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నా గుండె బరువెక్కింది: సీఎం**

మురళీనాయక్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఒక్కగానొక్క కుమారుడిని పోగొట్టుకున్న ఆ తల్లిదండ్రుల శోకంతో తన గుండె బరువెక్కిందని ఎక్స్ వేదికగా విచారం వ్యక్తం చేశారు. 'దేశం కోసం ఆయన ప్రాణత్యాగం ఎప్పుడూ స్ఫూర్తి రగిలిస్తూనే ఉంటుంది' అని చంద్రబాబు నివాళి అర్పించారు.

## సరిహద్దు రాష్ట్రాల్లో ప్రశాంతత

(మొదటిపేజీ తరువాయి)

కాల్పులు, బాంబు దాడులు నమోదు కాలేదు. అఖ్నూర్, రాజౌరి, పూంఛ్ జిల్లాల్లోనూ పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి తర్వాత డ్రోన్లు, కాల్పులు, బాంబు దాడులు జరగలేదు. భద్రతా బలగాలు మాత్రం పూర్తిస్థాయి అప్రమత్తతతో ఉన్నాయి. పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న పంజాబ్‌లోని పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్, అమృత్‌సర్‌లోనూ పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి తర్వాత నుంచి డ్రోన్లు, కాల్పులు, బాంబు దాడులు జరగలేదు. కాల్పుల విరమణకు అంగీకరించిన పాక్ గంటల్లోనే డ్రోన్లు పంపడం వల్ల రాత్రి అమృత్‌సర్‌లో బ్లాక్‌అవుట్ అమలు చేశారు. ఆదివారం ఉదయం ఎత్తివేశారు. అనుమానం ఉన్న వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. పాక్‌తో విస్తృత సరిహద్దు ఉన్న రాజస్థాన్ జిల్లాల్లోనూ ప్రస్తుతం పరిస్థితి సాధారణంగానే ఉంది. జైసల్మేర్ నగరంలో ఎలాంటి కాల్పులు, సైరన్ల మోతలు వినిపించడంలేదు. అయితే ముందు జాగ్రత్తగా సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు బ్లాక్‌అవుట్ విధించారు.

**ఇళ్లకు అప్పుడే రావొద్దు**

స్వస్థలాలకు అప్పుడే వెళ్లొద్దని పాకిస్థాన్ షెల్లింగ్ కారణంగా సురక్షిత ప్రాంతాల్లో ఉన్న సరిహద్దు గ్రామప్రజలను జమ్మూకశ్మీర్ యంత్రాంగం హెచ్చరించింది. పేలని షెల్స్ ఇంకా ఉంటాయని, వాటిని గుర్తించాల్సి ఉందని పేర్కొంది. భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నేపథ్యంలో ఆదివారం ఒక్కరోజే దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే దాదాపు 100 విమాన సర్వీసులు రద్దయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

## పాక్ వెన్నువిరిచిన బ్రహ్మోస్

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడ గగనతల రీఫ్యూయలర్ ట్యాంకర్ విమానాలు, భారీ రవాణా విమానాలు ఉన్నాయి. అప్పటికే పాకిస్థాన్ సైన్యం దిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్11 బాలిస్టిక్ క్షిపణులను భారత బలగాలు... గగనతల రక్షణ వ్యవస్థ ఎస్400తో మధ్యలోనే పేల్చివేసింది. శుక్రవారం అర్ధరాత్రి శ్రీనగర్ నుంచి నలియా వరకు 26 లక్ష్యాలపైకి పాక్ క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించగా వాటన్నింటినీ భారత రక్షణ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయని అధికారులు వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రతిగా భారత్ శనివారం తెల్లవారుజామున అత్యాధునిక క్షిపణులు, గైడెడ్ మ్యూనిషన్, లాయిటరింగ్ మ్యూనిషన్‌ను వాడినట్లు తెలుస్తోంది. వీటిలో బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూజ్ క్షిపణులు అత్యంత కీలక పాత్ర పోషించాయి. సుఖోయ్30 ఎంకేఐ యుద్ధ విమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి ఆ దేశానికి చెందిన పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయని వివిధ వర్గాల నుంచి అందుతున్న సమాచారం తెలియజేస్తోంది. ధ్వంసమైన వైమానిక స్థావరాల్లో...రఫీకీ, మురీద్, నూర్‌ఖాన్, రహీంయార్ ఖాన్, సుక్కుర్, చునియన్. పర్సూర్, సియాల్‌కోట్ ఉన్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని రఫీకీ వైమానిక స్థావరం అత్యాధునిక విమానాలకు కేంద్రం. 10,000 అడుగుల రన్‌వే ఇక్కడి ప్రత్యేకత. అత్యవసర ల్యాండింగ్ స్ట్రిప్‌లు ఉన్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని చక్వాల్‌లో మురీద్ ఉంది. ఇక్కడ కీలక వైమానిక స్థావరం ఉంది. మానవరహిత సాయుధ డ్రోన్లను ఇక్కడ నిల్వ చేస్తుంటారు. ఇస్లామాబాద్‌కు అత్యంత సమీపంలోని రావల్పిండిలో నూర్ ఖాన్ (చక్లాలా) వైమానిక స్థావరం ఉంది. పాక్ ఉన్నతస్థాయి జనరల్స్ ఇక్కడ భేటీ అవుతారు. ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ కార్యాలయం కూడా చక్లాలాలోనే ఉంది. ముఖ్యమైన ఈ వైమానిక స్థావరాలను భారత్ దెబ్బతీయడంతో పాకిస్థాన్‌కు ఎటూపాలుపోని పరిస్థితి ఏర్పడింది. అంతకుముందే ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలనూ పేల్చివేయడంతో భారత క్షిపణులను శత్రు సైన్యం గుర్తించలేకపోయింది. ఈ పరిస్థితుల్లో తమ వద్ద ఉన్న అణ్వాయుధాలను వినియోగించటం ఏమోగాని, వాటిని కాపాడుకోవటమూ కష్టమని స్పష్టం కావడంతో పాక్ నాయకత్వం చేతులెత్తేసింది. శనివారం మధ్యాహ్నానికి కాల్పుల విరమణకు సిద్ధమైందని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**రాజ్‌నాథ్ సింగ్ మాటల్లో...**

పాకిస్థాన్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేయడానికి బ్రహ్మోస్ క్షిపణులను వినియోగించినట్లు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాటల ద్వారా స్పష్టమవుతోంది. యుద్ధ రంగంలో వీటిని ఉపయోగించడం ఇదే తొలిసారి. భారత్ నిమిషాల వ్యవధిలో పాక్‌కు చెందిన కీలక వైమానిక స్థావరాలను ధ్వంసం చేయడం ఆ దేశంలో గుబులు రేపింది.

## నీరా.. సుందరీమణుల ఫిదా

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన అందగత్తెలు ఆదివారం నెక్లెస్‌రోడ్డులోని నీరా కేఫ్‌లో సందడి చేశారు. గీత కార్మికులు తాటి దొన్నెల్లో, ప్రత్యేక టిన్నుల్లో వారికి నీరా అందించారు. అందాల పోటీలు శనివారం ప్రారంభం కాగా ఆదివారం ఎక్కువ మంది భామలు హోటల్‌కు పరిమితమై విశ్రాంతి తీసుకున్నారు. కొంత మంది మాత్రం విడతల వారీగా హుస్సేన్‌సాగర్ తీరంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

## ఇంజినీరింగ్‌లో 73.26% .. అగ్రికల్చర్‌లో 87.82% ఉత్తీర్ణత నమోదు

హైదరాబాద్: తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్ ఎప్‌సెట్) ఇంజినీరింగ్ విభాగంలో 73.26%... అగ్రికల్చర్ ఫార్మా విభాగంలో 87.82% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండు విభాగాల్లో అబ్బాయిలే టాప్ ర్యాంకు సాధించారు. ఇంజినీరింగ్‌లో తొలి పది ర్యాంకులు, అగ్రికల్చర్ విభాగంలో మొదటి పదిలో తొమ్మిది ర్యాంకులను అబ్బాయిలే కైవసం చేసుకున్నారు. ఇంజినీరింగ్‌లో అబ్బాయిలు 72.79%, అమ్మాయిలు 73.88% మంది ఉత్తీర్ణులుకాగా... అగ్రికల్చర్‌లో అబ్బాయిలు 86.29%, అమ్మాయిలు 88.32% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండింటిలోనూ అమ్మాయిల అర్హత శాతం అధికంగా ఉండటం విశేషం. ఎప్‌సెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగాల ర్యాంకులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం తన నివాసంలో విడుదల చేశారు. ఉత్తీర్ణులైన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి టి.కిషన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎప్‌సెట్ కన్వీనర్ బి.డీన్‌కుమార్, కోకన్వీనర్ కె.విజయకుమార్‌రెడ్డి, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

**వరుసగా రెండేళ్లు ఉత్తరాంధ్ర విద్యార్థులదే తొలి ర్యాంకు**

ఇంజినీరింగ్‌లో ఏపీలోని పార్వతీపురం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్‌చంద్ర 160 మార్కులకు 150.058 సాధించి ప్రథమ ర్యాంకు పొందాడు. ఈ విద్యార్థి ఇంటర్‌మీడియట్‌ను హైదరాబాద్‌లోనే చదివాడు. ఈ విభాగంలో 138.25 మార్కులకు పదో ర్యాంకు దక్కింది. గత ఏడాది ఎప్‌సెట్‌లో కూడా శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన సతివాడ జ్యోతిరాదిత్య 160కి 155.63 మార్కులు సాధించి ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్నాడు.

# మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తా

*** బిఆర్ఎస్ పార్టీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మురుగునీటి సమస్య ను శాశ్వతంగా పరిష్కరిస్తామని బిఆర్ఎస్ పార్టీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి అపర్ణ పామ్ గ్రోవ్ నందు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి కాలనీలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మురుగునీటి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అపర్ణ పామ్ గ్రోవ్ నందు మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టి శాశ్వతంగా పరిష్కరిస్తామని అన్నారు. మౌళిక వసతుల కల్పనలో భాగంగా మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ క్రిష్ణా రెడ్డి, కొంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, ఏఈ ప్రవీణ్, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీధర్, ఇరిగేషన్ అధికారులు, వైస్ ఛైర్మన్ గంగయ్య నాయక్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ వినోద్, దప్పు కిరణ్, పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు సంగీతా రెడ్డి, సీనియర్ నాయకులు షన్ను, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## భారత సైన్యానికి వెన్నుదన్నుగా నిలిచి ఉగ్రవాదంపై పోరాటం చేయాలి

*** బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : భారత సైన్యానికి వెన్నుదన్నుగా నిలిచి ఐక్యమత్యంతో ఉగ్రవాదంపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ అన్నారు. భారత సైన్యం క్షేమంగా ఉండాలని ఆదివారం సుభాష్ నగర్ డివిజన్ ఎస్సార్ నాయక్ నగర్ లో ఆలూరీ వెంకట శేషాచారి గుబ్బల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో భారత సైన్యానికి మద్దతుగా పోరాటం చేస్తున్న సైనికులకు పెద్దమ్మ పోచమ్మ తల్లి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని పూజలు నిర్వహించారు. అనంతరం వీర మరణం పొందిన భారత సైనికులు మురళి నాయక్ , సచిన్ యాదవ్ రావు లకు మద్దతుగా ర్యాలీ నిర్వహించి సంఘీభావం తెలియజేశారు. భారతదేశ ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన వీర జవాన్ల ఆత్మ శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకూ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గుబ్బల లక్ష్మీనారాయణ ఆలూరీ వెంకట శేషాచారి, వై.రాజ్ గోపాల్ రెడ్డి, పివి భాస్కర్ రెడ్డి, శ్యామ్, చైతన్య, ప్రభాకర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, పితాని ప్రసాద్, రాజబాబు,ప్రసాద్ , కృష్ణంరాజు, మహేందర్ రెడ్డి శ్రీధర్ ,శ్రీనివాసు, శివప్రసాద్, సోమేశ్వరరావు, ప్రవీణ్,శ్రీహరి గోవిందస్వామి ,కిషోర్, శోభ, నాగలక్ష్మి, సంధ్య, విజయ,లక్ష్మీ, అత్యధిక సంఖ్యలో బాల బాలిక లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌కు భారీగా చేరుతున్న తెలంగాణ వాసులు.. మరో వంద మంది వచ్చే ఛాన్స్




భారత్, పాక్‌యుద్ధం ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల నుంచి తెలంగాణకు చెందిన విద్యార్థులు, పౌరులు పెద్ద సంఖ్యలో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకుంటున్నారు. ఇప్పటి వరకు 86 మంది తెలంగాణవాసులు ఢిల్లీ తెలంగాణ భవన్‌కు చేరుకోగా, వారిలో 26 మందిని రాష్ట్రానికి వెళ్ళేందుకు అవసరమైన రవాణా సౌకర్యాలు కల్పించి స్వగ్రామాలకు పంపించారు. ఇంకా దాదాపు 100 మందికిపైగా తెలంగాణ భవన్‌కు చేరుకునే అవకాశం ఉందన్న సమాచారం మేరకు అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో ఏర్పాట్లను రెసిడెంట్ కమిషనర్ డా. గౌరవ్ ఉప్పల్ ఆదివారం నాడు స్వయంగా సమీక్షించారు. తెలంగాణభవన్ సిబ్బందితో కలిసి భోజన వసతి, వైద్య, రవాణా తదితర ఏర్పాట్లను పరిశీలిస్తూ తగిన సూచనలు చేశారు. ఈ సమయంలో తెలంగాణ భవన్‌కు చేరుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అన్ని విధాల సహాయాన్ని అందిచనుందని డాక్టర్‌గౌరవ్ ఉప్పల్ తెలిపారు.

## కోలాహలంగా జిహెచ్ఎంసి మైదానాలు ..!

క్రీడాకారులతో ,జిహెచ్ఎంసి మైదానంలో కోలాహలంగా మారాయి..సమ్మర్ అంటేనే పిల్లలకు కొత్త కోర్సులు నేర్చుకోవడానికి ప్రత్యేక సమయం అని చెప్పవచ్చు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఇలాంటి వాటి పట్ల ప్రజలు ఎక్కువగా మక్కువ చూపిస్తుంటారు. అందుకే గత కొన్నేళ్లుగా జీహెచ్ఎంసీ ప్రత్యేక సమ్మర్ క్యాంప్లను ఏర్పాటు చేస్తోంది. ఈ ఏడాది కూడా 6 నుంచి 16 సంవత్సరాల వయసు గల పిల్లల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు , మానసిక ఒత్తిడిని తగ్గించేలా గత నెల ఏప్రిల్ 27 నుంచి మే 31వరకు 37 రోజుల పాటు ప్రత్యేక సమ్మర్ క్యాంపులు ప్రారంభించారు..ఎంపిక చేసిన కొన్ని ప్రత్యేక క్రీడ ప్రాంగణాల్లో క్రీడలు నిర్వహిస్తూ పిల్లలను ప్రోత్సహిస్తున్నారు.

## దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల త్యాగం చాలా గొప్పది

*** సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల త్యాగం చాలా గొప్పదని సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్ అన్నారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా యుద్ధంలో అమరులైన వీర జవాన్లు మురళి నాయక్, నవీన్ యాదవ్ ల కు నివాళులర్పిస్తూ ఆదివారం సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ దేవదానం అధ్యక్షతన షాపూర్ నగర్ రైతు బజార్ నుండి ఉషోదయ టవర్స్ వరకు ర్యాలీ నిర్వహించి గాజులరామారం చౌరస్తా దగ్గర ఇండియా పాకిస్తాన్ యుద్ధంలో అమరులైన వీరజవాన్లు మురళి నాయక్ సచిన్ యాదవులకు ఆయనతో పాటు సిఐటియు సీనియర్ నాయకులు బి సత్యం లు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ భారతదేశం పైకి ఉసిగొల్పుతోందని ఆ ఉగ్రవాదాన్ని భారత సైనికులు దృఢ సంకల్పంతో గట్టిగా ఎదుర్కొంటున్నారన్నారు. ఇండియా పాకిస్తాన్ యుద్ధంలో వీర జవాన్లు అమరులయ్యారని ప్రపంచ దేశాలు ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ను వ్యతిరేకించి ఉగ్రవాదంపై పోరాటం చేస్తున్న భారత్ కు మద్దతుగా నిలిచి పాకిస్తాన్ దుశ్చర్యలను వ్యతిరేకించాలని అన్నారు. ఈ దేశం కోసం ప్రాణాలర్పిస్తున్న సైనికుల త్యాగం చాలా గొప్పదని అన్నారు. పాకిస్తాన్ వారి దేశంలో ఉగ్రవాద స్థావరాలను గుర్తించి ఉగ్రవాదాన్ని మట్టు పెట్టకుండా, ప్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారతదేశం పైకి ఉసిగొలిపి అమాయకుల ప్రాణాలు బలిగొనడం , పాకిస్తాన్ కు అలవాటుగా మారిందన్నారు. పాకిస్తాన్ ఇలాంటి దొంగ దెబ్బలు తీయాలని చూస్తే భారతదేశంలో ఉన్న పౌరులు చూస్తూ ఊరుకోరన్నారు. భారత దేశంపై పాకిస్తాన్ ఇలాంటి ఉగ్రదాడులను ప్రోత్సహిస్తే పాకిస్తాన్ తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్నారు. దేశంలో ప్రజలందరూ వీర జవాన్లకు మద్దతుగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ నాయకులు కే శీను, రావుల స్వాతి ఖలీల్, గోపాల్, శంకర్, షఫీ, సాధులు, వజీర్, యువజన సంఘం నాయకులు ఆది నాగరాజు, మల్లారెడ్డి దుర్గా నాయక్ తదితరులు పాల్గొన్నారు

## పార్టీ విస్తరణకు సిపిఐ శ్రేణులు కృషి చేయాలి

*** సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: (రామవరం) పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేవిధంగా కృషి చేయడం ద్వారా పార్టీ విస్తరణకు నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలనీ సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని రామవరం సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికవర్గానికి, పేదప్రజలకు అనునిత్యం సేవలందించేదికమ్యూనిస్టు పార్టీ, ఏఐటీయూసీనేనని అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐకి ఎదురులేదని, ప్రజలకు అందించిన సేవల ఫలితంగాలో రోజురోజుకు జనాదరణ పెరుగుతుందని అన్నారు. కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని, ఎమ్మెల్యే కూనంనేని కృషితో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో నాయకులు కంచర్ల జమలయ్య, జి వీరాస్వామి, ముని గడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీను, ఎస్ కె ఫహీమ్, పాటి మోహన్, మాతంగి లింగయ్య, మాటేటి గోపాల్, గురుమూర్తి, గోపి, తూముల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, ఖయూమ్, నగేష్, అంకూస్, సింగిరాల రమేష్, దాసు, జలీల్, రణధీర్, మర్రి కృష్ణ, విజయలక్ష్మి, దార లక్ష్మి, శంకర్, దాట్ల శ్రవణ్, అలీం, అనీఫ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## అశ్వాపురం భారజల కేంద్రం లో పోలీసుల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ లో మాకు డ్రిల్ ను నిర్వహించారు. శనివారం నాడు హెవీ వాటర్ ప్లాంట్ లో ఈ మాక్ డ్రిల్ ను నిర్వహించడం జరిగింది. ఏదైనా అత్యవసర సమయంలో ఆకస్మిక దాడి జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ,సందర్భానుసారంగా రక్షణ కొరకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి తెలియపరుస్తూ ఈ మాక్ డ్రిల్ ను ఏర్పాటు చేయడం జరిగిందని డిఎస్పీ రవీందర్ రెడ్డి వెల్లడించారు.భారజల కేంద్రంలో ఉద్యోగులు పనిచేసే చోట , కాలనీలో నివసించే వారి కుటుంబాలు అత్యవసర సమయంలో అలారం సిస్టంను వినియోగించినప్పుడు పాటించవలసిన నియమ నిబంధనల గురించి వివరించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ కమాండెంట్ అమిత్ కుమార్, ఎస్డిపిఓ మణుగూరు రవీంద్ర రెడ్డి , అశ్వాపురం సిఐ జి అశోక్, ఎస్ఐ మధు ప్రసాద్, సిఐఎస్ఎఫ్ సిబ్బంది అశ్వాపురం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## వైభవంగా నల్లగుట్ట లక్ష్మీ నర్సింహా స్వామి కళ్యాణ మహోత్సవం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : గాజుల రామారం డివిజన్ నల్లగుట్ట లక్ష్మీ నర్సింహా స్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆలయంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ పాల్గొని నర్సింహా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అతి ప్రాచీన, మహిమాన్విత స్వయంభు లక్ష్మీ నరసింహ స్వామి దయతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, చెట్ల వెంకటేష్, చిన్నా చౌదరి, వాహిద్, శివ నాయక్, ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు ఎ.ఇంద్రసేనా గుప్తా, యాదగిరి, శ్రీరాములు, సురేష్, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూదేవి హిల్స్ లో వైభవంగా శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహం నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠ మహోత్సవం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : ఆల్విన్ కాలనీ డివిజన్ భూదేవి హిల్స్ లో ఆదివారం శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహం నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠ వేడుకలు అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి విగ్రహం, నాభిశిల ప్రతిష్ఠ వంటి పుణ్యకార్యాలు కాలనీవాసుల ఉమ్మడి సంకల్పానికి నిదర్శనాలన్నారు. కాలనీలో శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన గాని నా అభిశీల (బొడ్రాయి) నీ ప్రతిష్టించడం గాని చాలా మంచి కార్యక్రమం అని ప్రతిష్టించడం వలన కాలనీలో నివసించే వారికి కానీ చుట్టుపక్కల నివసించే వారందరికీ కూడా మంచి జరగాలని ఉద్దేశంతో చేపట్టినందుకు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు , కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## లీలాద్రీ క్షేత్రంలో కనుల పండుగగా లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : శ్రీ లక్ష్మీనరసింహ స్వామి



జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం తులసీనగర్ ఆల్విన్ కాలనీలోని లీలాద్రీ క్షేత్రంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం కనులపండుగగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఫౌండర్ చైర్మన్ మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు హాజరై స్వామివారికి పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాంతారావు దేవాలయం నిర్మించుటలో గాని ప్రతి సంవత్సరం లక్ష్మీనరసింహస్వామి జయంతి కార్యక్రమంలో భాగంగా మూడు రోజులు పూజలు చేసి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిపినందుకు, మమ్మల్ని పిలిచి భాగస్వాములు చేసినందుకు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆయనకు లక్ష్మీనరసింహ స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నామన్నారు.

# పి.ఆర్. చంద్ర యాదవ్‌కు రాజ్యసభలో అవకాశం దక్కేనా ?

*** సేవా నిబద్ధత, అనుభవం, రాహుల్ గాంధీతో సాన్నిహిత్యం కలిసి వచ్చే కీలక అంశాలు**



హైదరాబాద్, 11 మే (ప్రజా స్ఫూర్తి): తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో నిస్వార్థ సేవా దృక్పథంతో సుదీర్ఘకాలంగా పనిచేసిన ప్రముఖ నాయకుడు పి.ఆర్. చంద్ర యాదవ్ పేరు, తాజాగా ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల భర్తీలో కీలకంగా వినిపిస్తోంది. నియమ నిబంధనలకు కట్టుబడి, పార్టీలో పలు బాధ్యతలు నిర్వహించి, క్షేత్ర స్థాయిలో పార్టీ బలపడేలా చేసిన ఆయనకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీతో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధం, ప్రస్తుతం ఆయనకు మరింత బలం చేకూర్చుతోంది. రాహుల్ గాంధీ పాదయాత్రల సమయంలో పి.ఆర్. చంద్ర యాదవ్ అనుసరించిన క్రమశిక్షణ, నిజాయితీ, ప్రజలతో నేరుగా మమేకమైన తీరు పార్టీ అధిష్టానానికి నచ్చిన అంశాలుగా పేర్కొనబడుతున్నాయి. వయస్సుతో పాటు అనుభవాన్ని సమతూకంగా సమర్పించగల నేతగా ఆయనను పార్టీ ఆవశ్యకతగా భావిస్తోంది. ఇదిలా ఉంటే, దేశవ్యాప్తంగా బీసీ కుల గణనపై దృష్టి పెడుతున్న కాంగ్రెస్ పార్టీ, సామాజిక న్యాయాన్ని ప్రధాన అజెండాగా ఎత్తి చూపుతోంది. ఈ నేపథ్యంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నదే ప్రస్తుతం పార్టీ దృష్టి. ఇది పి.ఆర్. చంద్ర యాదవ్‌కు అనుకూలంగా పనిచేసే మరో ప్రధాన అంశంగా మారింది. బీసీ వర్గానికి చెందిన వారిలో సుదీర్ఘ అనుభవం కలిగిన, నిబద్ధత కలిగిన నేతగా ఆయనకు రాజ్యసభ అవకాశం దక్కటం తథ్యప్రాయమేనన్నది తాజా రాజకీయ విశ్లేషణ. ఈ అన్ని అంశాలు - అనుభవం, రాహుల్ గాంధీకి అత్యంత సమీపత, బీసీలకు ప్రాధాన్యం ఇచ్చే సమయస్ఫూర్తి - కలసి వచ్చి పి.ఆర్. చంద్ర యాదవ్‌కు రాజ్యసభ సభ్యత్వం రూపంలో గౌరవప్రదమైన అవకాశం కలిగే దిశగా సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## ప్రధాని మోదీపై అభ్యంతరకర పోస్టులు..
# పోలీసుల అదుపులో ముగ్గురు!



సోన్‌భద్ర: ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకొని సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తప్పుడు సమాచారం పోస్ట్ చేసినందుకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని సోన్‌భద్రలో ముగ్గురిని తమ నిర్బంధంలోకి తీసుకున్నారు. బాలగోపాల్ చౌరాసియా అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఫేస్‌బుక్‌లో అభ్యంతరకర కంటెంట్ పోస్టు చేసిన షబ్బీర్ అన్సారీ, జుబైర్ అన్సారీ, ఇజహార్‌లను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ కలూ సింగ్ వెల్లడించారు. ఈ అంశంపై దర్యాప్తు చేసిన ఏఎస్పీ.. ఆ పోస్టులు దేశ వ్యతిరేకంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అలాగే, నిందితులు శత్రుదేశాలతో సున్నితమైన సమాచారాన్ని పంచుకుంటున్నట్లు ఏఎస్పీ తెలిపారు. నిందితులు పాకిస్థాన్ యూట్యూబర్ ఫేస్‌బుక్ కంటెంట్‌ను ఉపయోగించుకొని ప్రధాని మోదీని తప్పుగా చిత్రీకరించేలా ఎడిట్ చేసిన పోస్టులను పెట్టినట్లు తమకు ఫిర్యాదు అందినట్లు పోలీసులు పేర్కొన్నారు. బాలగోపాల్ చౌరాసియా అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈ కేసులో ఆధారాలు సేకరించి అదుపులోకి తీసుకున్నారు.

## ఉగ్రవాదంపై రాజీ లేదు..
# పాక్‌ని తుడిచిపెట్టేసే సత్తా మనకు ఉంది: శిందే



ముంబయి: ఉగ్రవాదాన్ని భారత్ ఎట్టి పరిస్థితుల్లో సహించదని.. ప్రపంచ పటం నుంచి పాకిస్థాన్‌ను తుడిచిపెట్టేసే సత్తా మన దేశానికి ఉందని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే అన్నారు. ఆదివారం ఆయన ముంబయిలో మీడియాతో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు డ్రోన్, క్షిపణి దాడులతో సరిహద్దు ప్రాంతం దద్దరిల్లిన నేపథ్యంలో శనివారం భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజు శిందే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉగ్రవాదంపై ఎట్టిపరిస్థితుల్లో రాజీ ఉండదని, దీన్ని సహించేది లేదంటూ ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్థాన్‌కు గట్టి సందేశాన్నిచ్చారన్నారు. బాహ్య ముప్పును ఎదుర్కొనేందుకు భారత్ సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపారు. ఈ ప్రపంచ పటం నుంచి పాక్‌ను తుడిచిపెట్టే సామర్థ్యం భారత్‌కు ఉందన్న శిందే.. మన దేశ దృఢమైన వైఖరిని చూసి పాకిస్థాన్ నేర్చుకోవాలన్నారు. తన సొంత పరిమితులేంటో తెలుసుకొని భారత్‌తో సంబంధాలు పెట్టుకోవాలన్నారు. భారత్ పాక్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాల్పుల విరమణ, తదనంతర పరిస్థితిపై ఇరు దేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల డైరెక్టర్ జనరల్ మిలటరీ ఆపరేషన్స్ (DGMO)లు పాల్గొననున్నారు.

# దిల్లీ విమానాశ్రయంలో 100 విమాన సర్వీసులు రద్దు!



దిల్లీ: భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు.. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఒక్కరోజే దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే దాదాపు 100 విమాన సర్వీసులు రద్దయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతల వేళ దేశంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే 32 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. దిల్లీ విమానాశ్రయం నుంచి రద్దయిన వాటిలో 96 దేశీయ సర్వీసులు కాగా.. ఒక అంతర్జాతీయ సర్వీసు ఉన్నట్లు సమాచారం. ఈ విమానాలన్నీ ఆదివారం ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల మధ్య రద్దయినట్లు సంబంధితవర్గాలు పేర్కొన్నాయి. దిల్లీ విమానాశ్రయం సాధారణంగానే పనిచేస్తోందని దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ తెలిపింది. గగనతల డైనమిక్స్‌లో మార్పులు, కట్టుదిట్టమైన భద్రత నేపథ్యంలో కొన్ని విమానాల షెడ్యూళ్లు, భద్రతా తనిఖీ కేంద్రం ప్రాసెసింగ్ నియమాలు ప్రభావితం కావొచ్చని పేర్కొంది.



# పీవోకేను అప్పగించడంపై తప్ప వేరే చర్చల్లేవ్: భారత్

దిల్లీ: కశ్మీర్ విషయంలో తమకు స్పష్టమైన వైఖరి ఉందని భారత్ మరోసారి స్పష్టం చేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ తిరిగి రావడమనే ఒకే ఒక్క విషయం మిగిలి ఉందని తేల్చి చెప్పింది. ఈ మేరకు భారత ప్రభుత్వ వర్గాలు మీడియాకు సమాచారం ఇచ్చాయి. ఈ నెల 7న పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసిన తర్వాత పాక్ డీజీఎంవోకు సమాచారం ఇచ్చామని, చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పామని వెల్లడించాయి. అయితే, పాకిస్థాన్ నుంచి మాత్రం ఎలాంటి స్పందన రాలేదని తెలిపాయి. ఇరుదేశాల మధ్య కాల్పులు తీవ్ర స్థాయికి చేరుకున్న తర్వాత మే 10న పాకిస్థాన్ నుంచి చర్చలకు ప్రతిపాదన వచ్చినట్లు పేర్కొన్నాయి. భారత్ జరిపిన దాడుల్లో రహిమ్యార్‌ఖాన్ వైమానిక స్థావరం రన్‌వే నేలమట్టమైనట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని స్పష్టం చేశాయి. '' బహావల్‌పూర్‌లోని జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రధాన కార్యాలయాన్ని నేలమట్టం చేశాం. పాకిస్థాన్‌ను బలంగా, భారీగా, అత్యంత సుదూర ప్రాంతాల్లో దెబ్బతీశాం. అటువైపు నుంచి బుల్లెట్లతో దాడి చేస్తే.. మనం బాంబులతో సమాధానం ఇచ్చాం. బహావల్‌పూర్‌తోపాటు మురుద్కే, ముజఫర్‌బాద్ ఉగ్రవాద కేంద్రాలను నేలమట్టం చేశాం. మే 10న పాకిస్థాన్ దాడికి ప్రతిస్పందనగా అగ్ని వర్షం కురిపించాం. మొత్తం 8 స్థావరాలు లక్ష్యంగా దాడులు చేశాం'' అని ప్రభుత్వ వర్గాలు మీడియాకు వెల్లడించాయి..

*** ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదు**

''కశ్మీర్ విషయంలో భారత్‌కు స్పష్టమైన వైఖరి ఉంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను అప్పగించడం మినహా మరో విషయం లేదు. అంతకుమించి మాట్లాడేది లేదు. ఉగ్రవాదుల అప్పగింతపై వాళ్లు మాట్లాడితే మేమూ మాట్లాడుతాం. మరో విషయంపై మాట్లాడే ఉద్దేశం మాకు లేదు. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదు. ఎవరూ మధ్యవర్తిత్వం వహించాల్సిన అవసరమూ లేదు'' అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

*** పాక్‌కు దెబ్బకొట్టాం..**

ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ మూడు లక్ష్యాలను సాధించినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. సైనికంగా, రాజకీయంగా, మానసికంగా పాక్‌ను దెబ్బకొట్టినట్లు తెలిపాయి. ప్రతి రౌండ్‌లోనూ పాకిస్థాన్ పరిస్థితి మరింత దిగజారిందని, భారత్ చేతిలో ఓటమి పాలైందని వెల్లడించింది. పాకిస్థాన్ వైమానిక స్థావరాలపై భారత్ దాడి చేయగా.. ఇక పోరాడలేమని దాయాది దేశం తెలుసుకున్నట్లు పేర్కొన్నాయి.

# భారత్ దాడి చేసింది.. లష్కరే పుట్టపైనే!



అమాయక ప్రజలు, ప్రార్థనామందిరాలపై భారత్ బాంబుల వర్షం కురిపించిందంటూ.. పాక్ ఎన్ని కబుర్లు చెప్పినా మురీద్కేలోని ఉగ్రపాములను దాచలేకపోతోంది. అక్కడి మర్కజ్ తయ్యబా భవనం వివిధ రకాల ఉగ్రమూకలను సాకే కేంద్రంగా నిలిచిందని పశ్చిమ దేశాల మీడియా సంస్థలు కోడై కూస్తున్నాయి. తాజాగా స్కైన్యూస్ బృందం వివిధ సోషల్ మీడియా వేదికల నుంచి సేకరించిన వీడియోలు, ఫొటోలు, కామెంట్లను విశ్లేషించి.. మురీద్కేలో భారత్ దాడి చేసింది లష్కరే ఉగ్రపుట్టపైనే అని తేల్చింది. దీనికి తోడు ఈ దాడి తర్వాత అల్‌ఖైదా ఉపఖండం శాఖ భారత్‌ను తప్పుపట్టడాన్ని కూడా చూపించింది. మురీద్కేలోని మర్కజ్ తయ్యబాకు సంబంధించి టిక్‌టాక్, యూట్యూబ్, గూగుల్‌లలో పోస్టు చేసిన వీడియోలను స్కైన్యూస్ సేకరించింది. వాటిల్లో లష్కరే తయ్యబాకు మద్దతుగా చాలా క్లిప్స్ ఉన్నాయి. అత్యధికంగా '313' అనే గ్రూపు పోస్టు చేసిన వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. ఈ వీడియోల జియోలొకేషన్లు చూడగా వాటిల్లో చాలా వరకు లష్కరే, 313 అనే క్యాప్షన్లు వచ్చాయి. వీధుల్లో తుపాకులతో తిరుగుతున్న వ్యక్తులను ఓ వీడియోలో చూపించారు. దీనికి లష్కరే తయ్యబా, ముజాహిద్ ఫోర్స్, 313, మర్కజ్ తయ్యబా మురీద్కే అనే క్యాప్షన్లు ఉన్నాయి. మరో దానిలో పిల్లలు ఆయుధాలు వాడుతున్నట్లు చూపారు. అక్కడ కూడా '313 జిహాద్' అనే క్యాప్షన్ ఇచ్చారు. వీటిలో చాలా ఖాతాలకు పరస్పర సంబంధాలున్నాయి. ఇక టెర్రరిజం రీసెర్చి అండ్ అనాలిసస్ కన్సార్టియంకు చెందిన ముస్కాన్ సంగ్వాన్ స్పందిస్తూ.. 'బ్రిగేడ్ 313 అనేది పాక్‌లోని అల్ ఖైదా విభాగం. దీని ఛత్రం కింద తాలిబన్, లష్కరే జంగ్వీ, హర్కత్ ఉల్‌జిహాద్ అల్ ఇస్లామీ, జైషేమొహమ్మద్, లష్కరే తయ్యబా, జుందుల్లా సంస్థలు ఉంటాయి. బ్యాటిల్ ఆఫ్ బద్ర్‌కు గుర్తుగా 313 పేరు పెట్టుకున్నారు. వీరిలో అత్యధిక మంది టిక్‌టాక్‌నే వినియోగిస్తారు' అని చెప్పారు. ఇక స్కైన్యూస్ భారత్ దాడికి ముందు, తర్వాత ఇక్కడ లొకేషన్లను విశ్లేషించగా.. యూజర్ పేరులో 313 అని ఉన్న ఒకరు భారత్ దాడి తర్వాత దెబ్బతిన్న భవనాల వీడియోను పోస్టు చేశారు. మురీద్కేలోని ఈ ఉగ్రవాదులు సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ.. రిక్రూట్‌మెంట్‌కు మరింత మందిని ఆకర్షిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ఈ అంశంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా మహమ్మద్ అసిఫ్‌ను స్కైన్యూస్ ప్రశ్నించగా.. ఈ టిక్‌టాక్ వీడియోలను నమ్మకమైన ఆధారాలుగా పరిగణిస్తానంటే లక్షలు చూపిస్తానంటూ మాట్లాడారు.

# రష్యాతో ప్రత్యక్ష చర్చలకు సిద్ధం: జెలెన్‌స్కీ

రష్యా అధినేత పుతిన్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. ఇస్తాంబుల్ వేదికగా చర్చలకు పుతిన్ ఆహ్వానాన్ని నేరుగా ఆయన ప్రస్తావించలేదు. కానీ, ''ఎట్టకేలకు రష్యా యుద్ధం ముగించే విషయాన్ని పరిశీలిస్తోంది'' అని పేర్కొన్నారు. చాలా రోజుల నుంచి ఇందుకోసమే ప్రపంచం మొత్తం ఎదురు చూస్తోందన్నారు. యుద్ధం ముగింపులో మొదటి అడుగు కాల్పుల విరమణే అని పేర్కొన్నారు. ఈ మారణకాండను ఒక్కరోజు కూడా కొనసాగించడంలో అర్థం లేదు.

# కర్నూలు జిల్లా వ్యాప్తంగా పోలీసుల కార్డెన్ సెర్చ్

ప్రజల భద్రతే లక్ష్యమని కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ అన్నారు. ఈ మేరకు భారత్‌పాక్ ల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు గాను జిల్లా ఇంచార్జి ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ లో డీఎస్పీ బాబు ప్రసాద్ నేతృత్వంలో పోలీసులు, బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ.. చీఫ్ ఆఫీస్ ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇరు దేశాల మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజల భద్రతే లక్ష్యంగా ముందస్తు జాగ్రత్తలతో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ లో అనుమానితులను గుర్తించి విచారిస్తున్నామని తెలిపారు.



అనుమానాస్పద వ్యక్తులు గానీ, అనుమానాస్పద వస్తువులు గానీ, కొత్తగా ఎవరైనా వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. అంతకుముందు జిల్లా వ్యాప్తంగా ఉన్న బస్టాండ్ లో, చెక్ పోస్టులు, సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ తో కర్నూలు రెండో పట్టణ సీఐ నాగరాజారావు తదితరులున్నారు.

## 'భారత్‌తో యుద్ధం చేసే సత్తా పాక్‌కు లేదు'.. ఏపీ మంత్రి సంచలన వ్యాఖ్యలు

వారం రోజుల నుంచి భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి ఘటనలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన భారత్.. పాకిస్తాన్ ఉగ్రమూకల స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో మెరుపు దాడులు నిర్వహించింది. ఈ క్రమంలో పాక్ సైనికులు చేస్తున్న డ్రోన్స్, మిసైల్ దాడులను భారత్ సమర్థవంతంగా ఎదుర్కొంది. ఈ క్రమంలో అక్కడి మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌తో యుద్ధం చేసే సత్తా పాకిస్తాన్‌కు లేదని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని అండగా చేసుకుని దాడులకు పాల్పడు తుందని విమర్శించారు. ఈ క్రమంలో పాకిస్తాన్‌కు భారత్ సైన్యం దీటైన జవాబి చ్చిందన్నారు. తీవ్రవాదంతో రెచ్చిపోయి..సింధూరం తుడిచేస్తే 'ఆపరేషన్ సిం దూర్'ను మహిళా శక్తి ముందుండి నడిపించిందన్నారు. భారతీయులంతా



ఏకమై పాక్ ఉగ్రమూకలను, వారి విధానాలను తిప్పి కొడతారన్నారు. భారత్-పాక్ యుద్ధం పై ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారయణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో పాక్ తో జరిగిన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వీరా జవాన్ మురళి నాయక్ కుటుంబానికి మంత్రి సానుభూతి తెలిపారు. ఇవాళ (ఆదివారం) నెల్లూరు జిల్లాలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు.



## వారికే ఈ మదర్స్ డే అంకితం: వైఎస్ షర్మిల

మాతృభూమి రక్షణ కోసం అసువులు బాసిన జవాన్ మురళి నాయక్ లాంటి వీరులను కన్న తల్లులకు, మన దేశ రక్షణ కోసం కన్నప్రేమను పణంగా పెట్టిన వీరమాతలకు ఈ మదర్స్ డే అంకితమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు.. మదర్స్ డే సందర్భంగా ఆమె ట్వీట్ చేశారు. ఈ దేశ ముద్దుబిడ్డలు మన సైనికులు. ఇలాంటి రక్షకులకు జన్మనిచ్చిన ప్రతి తల్లికి మాతృదినోత్సవ శుభాకాంక్షలు. యుద్ధ భూమిలో బిడ్డను కోల్పోయిన దుఃఖాన్ని దిగమింగుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేశాడనే గర్వాన్ని చూపే అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. మనిషి జన్మకు, గమనానికి మూలం అమ్మ. ఈ సృష్టిలో అమ్మ ప్రేమకు సమానమైనది మరొకటి లేదు. అమ్మ ప్రేమ, దీవెనలే మనకు కొండంత అండ.'' అని షర్మిల తెలిపారు.

## పీఓకేను ఆక్రమించకుండా కాల్పుల విరమణకు ఎందుకొచ్చారు : సీపీఐ నారాయణ

భారత్‌పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్తలకు ఆమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యంతో బ్రేక్ పడిన విషయం తెలిసిందే. దాదాపు మూడు రోజుల పాటు కొనసాగిన ఈ యుద్ధ వాతావరణంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయగా.. కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి. ఇదిలా ఉంటే పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలపై భారత వాయుసేన ఆపరేషన్ సింధూర్ పేరుతో దాడి చేసి 100 మందిని హతమార్చగా.. సీపీఐ నారాయణ దీనిని వ్యతిరేకించారు. తాజాగా.. భారత్ పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణను ఆయన స్వాగతిస్తూ ఓ వీడియోను విడుదల చేశారు. భారత్ యుద్ధాన్ని ఆపడం పై పలు విమర్శలు చేశారు. ఆ వీడియోలో ఆయన మాట్లాడుతూ.. భారత్‌పాక్ మధ్య శాంతి చర్చలు జరగాలి అన్నందుకు ఒకప్పుడు



నన్ను పాకిస్తాన్ పంపాలని అవాక్కులు చవాకులు పేలారు, మరి ఇప్పుడు ప్రధాని మోడీని పాకిస్తాన్ పంపించాలా అని ప్రశ్నించారు. భారత్ పీఓకేను ఆక్రమించకుండా ఎందుకు కాల్పుల విరమణకు వెళ్లిందని ఈ సందర్భంగా సీపీఐ నారాయణ భారత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

### మద్యం కుంభకోణం పై

## ఎక్సైజ్ శాఖ మంత్రి సంచలన వ్యాఖ్యలు

తిరుచానూరు: మద్యం కుంభకోణంలో అరెస్టులు తప్పవు, గత ప్రభుత్వం చేసిన తప్పులకు భారీ మూల్యం చెల్లించాల్సిందే అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తిరుచానూరులోని రాష్ట్ర వన్నియకుల క్షత్రియ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సి.ఆర్.రాజన్ నివాసానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విచ్చేసి, మహాబలిపురంలో వన్నియకుల క్షత్రియ మహా యువజన సభ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మద్యం కుంభకోణం సిట్ విచారణ పై హాట్ కామెంట్స్ చేశారు. మద్యం కుంభకోణం పై సిట్ విచారణ వేగవంతంగా చేస్తోందని, అందులోని




నిందితులను చట్టపరంగా వదిలే ప్రసక్తే లేదని తెలిపారు. అలాగే, రాష్ట్రంలోని బెల్ట్ షాప్ లపై చర్యలు తీసుకుంటున్నామని, మద్యం పాలసీకి విరుద్ధంగా వ్యవహరిస్తే, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భారతీయ మహిళల నుదుట ఉన్న సింధూరం తుడిచేసిన ఉగ్రవాదులను అంతం చేయడం కోసం ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో కోరుకుంటున్నారని తెలిపారు.

### ద్వారకాతిరుమల పరిసర ప్రాంతాల్లో

## డ్రోన్‌తో నిఘా.. కారణం ఏంటంటే?

ఏలూరు జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల దేవస్థానంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీవారి వైశాఖ బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భీమడోలు ఇన్స్పెక్టర్ యుజే విల్సన్ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ బాబు, పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ బాబు మాట్లాడుతూ.. భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ దైవ దర్శనానికి క్యూ లైన్ ను పాటించాలన్నారు. అలాగే పిల్లలను, వెంట తెచ్చుకున్న సామగ్రిని గమనించుకోవాలి అని కోరారు. ఏదైనా



అనుమానాస్పద వస్తువులు ఎవరైనా చూసినట్లయితే వెంటనే డయల్ 112కు గాని ద్వారకాతిరుమల ఎస్సై ఫోన్ నెంబర్ 9449796653కు సమాచారం అందించిన పది నిమిషాలలో విచారణ చేస్తామన్నారు. పోలీస్ అధికారులు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిశోర్, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు ద్వారకాతిరుమల దేవస్థానం పరిసర ప్రాంతాలలో డ్రోన్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. అదే విధంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నారు.

## ఆ అంశంలో అనుమానాల నివృత్తికి రెడీ..

### మంత్రి పొన్నం హాట్ కామెంట్స్

ప్రధాని నరేంద్ర మోడీ వద్ద టైం ఇప్పిస్తారా?, కుల గణనపై అనుమానాల నివృత్తికి సిద్ధంగా ఉన్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో బీసీ కమిషన్ వేసుకొని, బుసాని వెంకటేశ్వర రావుతో డెడికేటెడ్ కమిషన్ వేసుకొని, లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులతో పారదర్శకంగా సర్వే నిర్వహించామని తెలిపారు. మహారాష్ట్రలో బీసీ కుల గణన చేస్తామని అసెంబ్లీలో తీర్మానం చేయగానే మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చారని, బీహార్ లో కుల గణన చేపట్టి ఆ నివేదిక అసెంబ్లీలో ప్రవేశపెట్టక ముందే ఆర్జేడీ, జేడీయూ ప్రభుత్వాన్ని బీజేపీ కూల్చేసిందని ఆరోపించారు. జార్ఖండ్లో బీసీల రిజర్వేషన్లు పెంచుతామని అసెంబ్లీలో తీర్మానం పెట్టగానే తప్పుడు కేసులతో ఆ రాష్ట్ర సీఎం హేమంత్ సోరెన్ ను జైల్లో వేశారని, అటువంటి చరిత్ర బీజేపీ కేంద్ర ప్రభుత్వానిదని తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రాల నుంచి కేంద్రం వరకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని




కొనియాడారు. బీజేపీ అధ్యక్ష పదవి, శాసన సభలో బీజేపీ ప్రతిపక్ష నాయకుడి పదవి, మండలిలో పక్ష నాయకుడి పదవులకు బీసీలు పనికిరారా? అని నిలదీశారు. అన్ని అత్యున్నత పదవులు వేరే సామాజిక వర్గానికి కేటాయించిన బీసీ లపై మొసలి కన్నీరు కారిస్తే సమాజం అంగీకరిస్తుందా? అని ప్రశ్నించారు. చేతనైతే బీసీలకు ప్రయోజనాలు కల్పించాలి అంతేతప్ప.. ఒక సాహసోపేతమైన నిర్ణయాన్ని అమలు చేసే ప్రయత్నం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ కృషికి గండి కొట్టొద్దన్నారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చేసిన బిల్లును ఆమోదింపజేసి బీసీలపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ కేంద్ర విద్యా సంస్థలైన ఐఐటీ, ఐఐఎం లాంటి వాటిలో కూడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలదని గుర్తు చేశారు. బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీ పై బీజేపీ నేత లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుల గణన కు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు వెళ్లి అఫిడవిట్ సమర్పించిన చరిత్ర బీజేపీదన్నారు. మండల్ కమిషన్ వస్తే కమండలం తీసుకొచ్చింది బీజేపీ.. బీజేపీ అగ్రవర్ణాల ఫ్యూడలిస్ట్ పార్టీ అని విమర్శించారు. కులగణన చేసి బీసీలకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచి చేసిన చట్టం తెలంగాణ దేశానికి రోల్ మోడల్ గా నిలుస్తోందన్నారు. తెలంగాణను చూసే తప్పని పరిస్థితుల్లో కేంద్రంలో జన గణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తెలంగాణలో చేసిన కుల గణన చూసి దేశవ్యాప్తంగా చేస్తున్నారని, ఇక్కడ చేసిన కుల సర్వే ఆధారంగా పెంచిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచుతూ చేసిన చట్టాన్ని రాష్ట్ర బీజేపీ నేతలు ఆమోదించి, బీసీలకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

# బొమ్మల న్యాప్‌కిన్లు... భలే ఉన్నాయే

వంటింట్లో పనిచేస్తున్నంతసేపూ పదేపదే న్యాప్‌కిన్లతో చేతులు తుడుచుకోవడం మామూలే. మరి ఆ న్యాప్‌కిన్లే కాస్త కొత్తగా కనిపిస్తే... వంటింటికే అందం వచ్చేయదూ. అందుకే ఇప్పటివరకూ వాడుతున్న వాటిని పక్కన పెట్టేసి ఈ డిజైనర్ డాల్ రకాలను గోడకు తగిలించి చూడండి. పిల్లికూన, బన్నీ, అమ్మాయి, పప్పీ... ఇలా రకరకాల ఆకృతుల్లో వచ్చే ఈ న్యాప్‌కిన్లు చూడ్డానికి అచ్చంగా బొమ్మల్లానే కనిపిస్తాయి. వీటిని సింకు వెనకాల తగిలిస్తే, మధ్యమధ్య చేతులు తుడుచుకోవచ్చు. మొదటిసారి, మీ వంటింట్లోకి వచ్చినవారెవరైనా బొమ్మల్ని ఇక్కడ తగిలించారేంటని అడగకుండా ఉండలేరు.







# రంగుల చేపలు... కురిపిస్తున్నాయి కోట్లు!



**అక్వేరియంలో రంగురంగుల చేపల్ని చూస్తూ ఉంటే... ఒత్తిడి తగ్గుతుందని చెబుతోంది ఓ అధ్యయనం. అందుకే ప్రపంచంలో స్టాంప్ సేకరణ తర్వాత అతిపెద్ద హాబీ ఇదేనని అంటున్నారు. ఆ రంగుల చేపల పెంపకం, అమ్మకంలో నంబర్‌వన్‌గా నిలుస్తోంది చెన్నై సమీపంలోని కొళత్తూరు అనే ప్రాంతం. ఆసియాలోనే అతిపెద్ద రంగుల చేపల మార్కెట్‌గా ప్రసిద్ధిచెందిన ఈ గ్రామం సాగు బాగులేక కుంగిపోయిన రైతుల జీవితాల్లో రంగుల వెలుగుల్ని నింపుతోంది!**

విల్లివాక్కం... చెన్నై నుంచి తిరుపతి మార్గంలో ఉండే ఓ చిన్న రైల్వే స్టేషన్. అక్కడి నుంచి ఓ అర కిలోమీటరు దూరంలో ఉంటుంది కొళత్తూరు. అక్కడ ఐదు వీధులు... వాటిల్లో ఇళ్లుండవు... షాపులు మాత్రమే ఉంటాయి. అగ్గిపెట్టెల్లా అతిచిన్నవి కొన్నయితే, ఆధునిక షోరూమ్‌ల్లాంటివి మరికొన్ని. అన్నీ కలిపి వాటి సంఖ్య 200 పైచిలుకు. ఆస్కార్స్, గోల్డ్‌ఫిష్, అరవోనా, చాకొలెట్ మోలీ, గప్పీ, సిక్లిడ్స్... ఇలా మూడొందల జాతులకి చెందిన చేపలుంటాయి ఆ షాపుల్లో. ఆ దుకాణాలు దాదాపు 50 వేలమందికి ఉపాధి చూపుతున్నాయంటే ఎవరూ నమ్మలేరు. అంతేకాదు, అవన్నీ కలిసి ఏటా రూ.300 కోట్ల వ్యాపారం చేస్తున్నాయనీ... ఈ ప్రాంతం ఆసియాలోనే అతిపెద్ద రంగుల చేపల మార్కెట్ అనీ... గణాంకాలు చెబుతుంటే అసలు నమ్మబుద్ధేయదు. ఆ వీధులూ... ఆ షాపులూ... అంత సాదాసీదాగా కనిపిస్తాయి. ఒకప్పుడు ఆకలిచిచ్చుకు అల్లాడిన రైతులు సాధించిన చక్కటి విజయాన్ని మన కళ్లముందు నిలుపుతాయి...

**సాగులేక...**

మీనాక్షి అమ్మవారు కొలువైన మదురై నగరం, దాని చుట్టుపక్కల ప్రాంతాలూ ఒకప్పుడు వ్యవసాయానికి ప్రసిద్ధిచెందినవి. వైగై నది ఆ ప్రాంతాల్ని సస్యశ్యామలం చేస్తుండేది. ఆ నది ప్రవాహం తగ్గడంతో భూములన్నీ బీడుపడ్డాయి. వ్యవసాయాన్ని నమ్ముకున్న ఎన్నో కుటుంబాలు పొలోమంటూ పట్నాల బాటపట్టాయి. అలా చెన్నై చేరిన శేఖర్ అనే రైతు కూలీనాలీ చేసుకుంటూ ఈ కొళత్తూరు ప్రాంతంలో తలదాచుకున్నాడు. అవి 1980ల నాటి రోజులు. అప్పట్లో చెన్నై నగరానికి చెందిన వ్యాపారులు కొందరు... రంగుల చేపలు కొన్నింటిని చెరువులో వేయడం... అవి కాస్త పెరిగాక తిరిగి తీసుకెళ్లడం గమనించాడు శేఖర్. ఒకప్పుడు ధనవంతులకే పరిమితమైన రంగుల చేపలు పెంచుకునే అలవాటు మధ్యతరగతిలోకీ చొచ్చుకొస్తోందని పసిగట్టాడు. వాటిని ఎలా పెంచాలో నేర్చుకున్న అతను... నీళ్లు నింపిన పాలిథీన్ కవర్‌లలో పెట్టి వీధివీధికీ తీసుకెళ్లి అమ్ముతుండేవాడు. రెండేళ్లలోనే వ్యాపారం మూడుపువ్వులూ ఆరుకాయలైంది. సొంతూరి నుంచి అతనికి సహాయకులుగా వచ్చిన కొందరు ఏడాది తిరక్కుండానే సొంత వ్యాపారం పెట్టారు! అది చూసి మిగతావాళ్లూ రాసాగారు. అలా మదురై ప్రాంతం నుంచే ఏడొందల కుటుంబాలొచ్చి స్థిరపడ్డాయి! వాళ్లని చూసి మిగతా ప్రాంతాలవాళ్లూ వచ్చారు. చూస్తుండగానే... ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్రలకీ నేరుగా చేపలు సరఫరా చేయసాగారు ఇక్కడి వ్యాపారులు. తర్వాత్తర్వాత చైనాసింగపూర్ మలేషియాలకీ ఎగుమతి చేయడం మొదలుపెట్టారు. ప్రస్తుతం ఐదువీధులూ కలిపి రోజుకి కోటిరూపాయల వ్యాపారం జరుగుతోందని అంచనా. ఈ విజయాన్ని చూసి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ ప్రభుత్వాలూ ఇక్కడికొచ్చి అధ్యయనం నిర్వహించాయి. అంతేకాదు, ఇక్కడి వ్యాపారులు తమిళనాడుఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న పలుగ్రామాల్లో ఈ తరహా చేపలసాగుకి సహకరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి జిల్లా తడ దగ్గరున్న దేవంబట్టు గ్రామం అలాంటిదే. సముద్రానికి దగ్గరగా ఉన్న ఈ గ్రామంలోని భూములు చౌడుబారిపోవడంతో వ్యవసాయం దెబ్బతింది. రాబడిలేక అలమటిస్తున్న రైతులకి రంగుల చేపల్ని సాగుచేయడం నేర్పారు కొళత్తూరు వ్యాపారులు. దేవంబట్టు గ్రామంలో ఇప్పుడు 160 ఎకరాల్లో రంగుల చేపల్ని సాగుచేస్తున్నారు. దాదాపు నాలుగువందల కుటుంబాలు దీనిపైన ఆధారపడి జీవిస్తున్నాయి! కొందరు రైతులు నెలకి రూ.30 వేల దాకా ఆదాయం కళ్లజూస్తున్నారు.









## మైలేజ్ విషయంలో ఈ ఈవీ కార్లే కింగ్..

### 400 కిలోమీటర్లకు పైగా రేంజ్



**న్యూఢిల్లీ:** ఎలక్ట్రిక్ కారు కొనుగోలు చేసేటప్పుడు ప్రజలు అనేక విషయాలను పరిశీలిస్తారు. వాటిలో రేంజ్ అతి ముఖ్యమైంది. అధిక రేంజ్ ఇచ్చే కార్లలో దూర ప్రాంతాలకు చక్కగా ప్రయాణం చేయవచ్చు. ప్రయాణం ఖర్చు కూడా బాగా తగ్గుతుంది. ఈ నేపథ్యంలో మార్కెట్ లో అందుబాటులో ఉన్న ఎలక్ట్రిక్ కార్లలో దాదాపు 400 కిలోమీటర్లకు పైగా రేంజ్ ఇచ్చే మోడళ్ల వివరాలు, వాటి ధర, ఇతర ప్రత్యేకతలను తెలుసుకుందాం. ఉదాహరణకు రాజమండ్రి నుంచి హైదరాబాద్ కు మధ్య దూరం సుమారు 430 కిలోమీటర్లు. సింగిల్ చార్జింగ్ తో ఈ కార్లలో చాలా సులువుగా, తక్కువ ఖర్చుతో హైదరాబాద్ వెళ్లపోవచ్చు.

#### ఎంజీ విండ్సర్ ఈవీ ప్రో

అధిక రేంజ్ ఇచ్చే ఎలక్ట్రిక్ కార్లలో ఎంజీ విండ్సర్ ఈవీ ప్రో ఒకటి. దీన్ని ఒక్కసారి చార్జింగ్ చేస్తే సుమారు 449 కిలోమీటర్లు పరుగులు తీస్తుంది. దీనిలో అతి పెద్ద బ్యాటరీ ప్యాక్ ఏర్పాటు చేశారు. ఈ కారు ఎక్స్ షోరూమ్ ధర రూ. 17.49 లక్షలు కాగా.. బ్యాటరీ సేవగా కొనుగోలు చేస్తే రూ. 12.50 లక్షలకే అందుబాటులోకి వస్తుంది.

#### టాటా కర్వ్

టాటా కంపెనీ నుంచి అనేక ఎలక్ట్రిక్ కార్లు విడుదల అయ్యాయి. వాటిలో టాటా కర్వ్ చాలా ముఖ్యమైంది. ఈ కారును ఒక్కసారి చార్జింగ్ చేస్తే సుమారు 500 కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చు. మంచి రేంజ్ కోరుకునే వారికి తిరుగులేని ఎంపిక అని చెప్పవచ్చు. ఈ కారు రూ. 17.49 లక్షల నుంచి రూ. 22.24 లక్షల (ఎక్స్ షోరూమ్) ధరకు అందుబాటులో ఉంది.

#### ఎంజీ జెడ్ఎస్

అధిక రేంజ్ అందించే ఎలక్ట్రిక్ కార్లలో ఎంజీ జీఎస్ ఈవీ ఒకటి. సింగిల్ చార్జింగ్ పై సుమారు 461 కిలోమీటర్లు పరుగులు పెడుతుంది. పైగా ఇది ఐదు సీట్ల కారు కావడం మరింత విశేషం. రూ. 18.98 లక్షల నుంచి రూ. 26.64 లక్షల (ఎక్స్ షోరూమ్) ధరకు ఈ కారు లభిస్తుంది.

#### టాటా నెక్సాన్

టాటా నెక్సాన్ ఈవీ కూడా మెరుగైన రేంజ్ ఇచ్చే కార్లలో ముందుంటుంది. సింగిల్ చార్జింగ్ పై దాదాపు 489 కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చు. ఈ కారు ప్రారంభ ధర (ఎక్స్ షోరూమ్) రూ. 12.49 లక్షలు, అయితే టాప్ వేరియంట్ కోసం రూ. 17.19 లక్షలు ఖర్చు చేయాలి.

#### హ్యుందాయ్ క్రెటా

హ్యుందాయ్ కంపెనీ ఈ ఏడాది జనవరిలో తన ఎలక్ట్రిక్ కారు క్రెటాను మార్కెట్ లోకి విడుదల చేసింది. ఈ కారు సింగిల్ చార్జింగ్ పై సుమారు 473 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. ఈ కారు ప్రారంభ ధర రూ. 17.99 లక్షలు కాగా, టాప్ వేరియంట్ రూ. 24.38 లక్షలకు అందుబాటులో ఉంది.

#### టాటా పంచ్

టాటా పంచ్ ఎలక్ట్రిక్ కారు ప్రజల ఆదరణ పొందింది. సామాన్యులు కొనగలిగే ధరలో దీన్ని తీసుకువచ్చారు. సింగిల్ చార్జింగ్ పై సుమారు 421 కిలోమీటర్లు పరుగులు తీస్తుంది. ఈ కారు ప్రారంభ ధర రూ. 9.99 లక్షలు కాగా, టాప్ వేరియట్ రూ. 14.44 లక్షలకు అందుబాటులో ఉంది.

#### మహీంద్రా ఎక్స్ యూవీ 400

మహీంద్రా నుంచి విడుదలైన ఎక్స్ యూవీ 400 ఎలక్ట్రిక్ కారు మంచి రేంజ్ తో ఆకట్టుకుంటోంది. ఈ ఐదు సీట్ల కారును ఒక్కసారి చార్జింగ్ చేస్తే సుమారు 456 కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చు. ఈ కారు నుంచి రూ. 16.74 లక్షల నుంచి రూ. 17.69 లక్షల ధరకు కొనుగోలు చేయవచ్చు.

## భారీగా పెరుగుతున్న క్రిప్టో కరెన్సీ విలువ..

### నెలలో ఏకంగా 37 శాతం వృద్ధి



**న్యూఢిల్లీ:** అమెరికా, యూకే వాణిజ్య ఒప్పందంతో సహా ప్రపంచవ్యాప్తంగా దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాల కారణంగా బిట్‌కాయిన్ ధర 1,00,000 డాలర్లకు చేరుకుంది. బిట్‌కాయిన్ ధర గత 24 గంటల్లో 4 శాతం పెరిగి 1,02,901.46 వద్ద ట్రేడవుతోంది. గత ఐదు రోజుల్లో ధర 8.87 శాతం పెరిగింది. అయితే గత ఒక నెలలో 37.20 శాతం లాభం. 2 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాప్‌ను తిరిగి పొందిన తర్వాత బిట్‌కాయిన్ అమెజాన్‌ను అధిగమించి ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆస్తిగా అవతరించింది. బిట్‌కాయిన్ బలమైన రికవరీ 1,00,000 డాలర్ల మార్కును మళ్లీ దాటడం అనేది విధాన మార్పులు, సంస్థాగత విశ్వాసం, స్థూల ఆర్థిక ప్రతికూలతల ఆధారంగా జరిగిందని నిపుణులు చెబుతున్నారు. యూఎస్-చైనా, యూఎస్-యూకే వాణిజ్య చర్చల వల్ల పెరిగిన ఆశావాదం యూఎస్ ఫెడరల్ రిజర్వ్, డిజిటల్ రిస్క్ ఆస్తిగా బిట్‌కాయిన్ ద్వారా స్థిరమైన వడ్డీ రేట్లతో సహా విస్తృత మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచిందని పేర్కొంటున్నారు.

ముఖ్యంగా బిట్‌కాయిన్ ఈటీఎఫ్‌ల ద్వారా పర్యావరణ వ్యవస్థకు అపూర్వమైన విశ్వసనీయత, డిమాండ్‌ను అందించింది. ఈ సంవత్సరం ప్రారంభంలో వ్యూహాత్మక బిట్‌కాయిన్ రిజర్వ్‌ను స్థాపించడానికి అమెరికా ప్రభుత్వం తీసుకున్న చర్య ముఖ్యమైనదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. డిజిటల్ ఆస్తులను సార్వభౌమ స్థాయిలో స్వీకరిస్తున్నారనే దానికి ఇది చారిత్రాత్మక సంకేతమని పేర్కొంటున్నారు. ప్రస్తుత పెరుగుదల విస్తృత బుల్లిష్ ర్యాలీకు సంబంధించిన రెండవ దశను సూచిస్తుంది. అలాగే 1,00,000 డాలర్ల మార్కు కంటే తక్కువ బిట్‌కాయిన్‌ను కొనుగోలు చేసే అవకాశం ఇక ఉండకపోవచ్చని పేర్కొంటున్నారు. బిట్ కాయిన్‌పై అన్ని వర్గాలలోనూ సంస్థాగత ఆసక్తి పెరుగుతుండడంతో ఈ స్థాయి పెరుగుదలకు కారణమని చెబుతున్నారు.

అలాగే ఇతర క్రిప్టో కరెన్సీ ఇథీరియమ్ 20 శాతం కంటే ఎక్కువ జంప్‌తో కీలకమైన నిరోధం కంటే 2,200 డాలర్ల వద్ద ఉంది. అలాగే సొలానా 160 డాలర్ల కంటే ఎక్కువగా పెరగడంతో ఆల్ట్‌కాయిన్‌లు కూడా భారీ ఊపును పొందాయని నిపుణులు చెబుతున్నారు. టాప్ 10లోని ఇతర టోకెన్‌లు కూడా పెరిగాయి. విట్టువల్స్ ప్రొటోకాల్ 40 శాతం కంటే ఎక్కువ జంప్‌తో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత బ్రెట్ 37 శాతం, పెపే 30శాతం, స్టోరీ 27.5 శాతం, యూనిస్వాప్, అధికారిక ట్రంప్ %ఒ% ఎథెనా 25 శాతం కంటే ఎక్కువ పెరిగాయి.



## ముక్కోణపు సిరీస్

# టీమిండియా కైవసం

**కొలంబో:** వన్డే వరల్డ్ కప్ ముందు భారత మహిళల జట్టు అద్భుత విజయం సాధించింది. ముక్కోణపు సిరీస్ ఫైనల్లో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో స్మృతి మంధాన (116) సూపర్ సెంచరీతో భారీ స్కోర్ చేసిన టీమిండియా.. అనంతరం ప్రత్యర్థిని 245 పరుగులకే ఆలౌట్ చేసింది. దాంతో, 97 పరుగులతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన జయభేరి మోగించింది. తద్వారా నిరుడు ఆసియా కప్ ఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది.

ముక్కోణపు సిరీస్‌లో లీగ్ దశ నుంచి అదరగొట్టిన టీమిండియా ఫైనల్లో పంజా విసిరింది. బలమైన శ్రీలంకను చిత్తు చిత్తుగా ఓడించి ఆసియా కప్ ఓటమికి బదులు తీర్చుకుంది. ప్రేమదాస స్టేడియంలో ఓపెనర్ స్మృతి మంధాన(116) రికార్డు సెంచరీతో విరుచుకు పడగా.. బౌలర్లు లంక బ్యాటర్లకు దడ పుట్టించారు. అమన్‌జీత్ కౌర్ (3-54) నిప్పులు చెరగగా.. మిడిల్ ఓవర్లలో స్నేహ్ రానా(4-38) వికెట్ల వేట కొనసాగించింది. దాంతో, ఆతిథ్య లం 245 పరుగులకే ఆలౌటయ్యింది. విధ్వంసక సెంచరీతో జట్టు విజయంలో భాగమైన మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది. ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్నేహ్ రానా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును స్వీకరించింది.



లీగ్ దశలో శ్రీలంకను ఓడించి.. ఆ తర్వాతి పోరులో ఓడిన భారత్ ఫైనల్లో ఛాంపియన్ ఆటతో రెచ్చిపోయింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు ప్రతీకా రావల్(30), స్మృతి మంధాన(116 101 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లు) శుభారంభం ఇచ్చారు. ఆ తర్వాత హర్లీన్ డయోల్(47), జెమీమా రోడ్రిగ్స్(44) కెప్టెన్ హర్మన్‌ప్రీత్(41)లు లంక బౌలర్లను ఉతికేశారు. మిడిలార్డర్ మెరుపులతో ప్రత్యర్థికి 343 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది భారత్. ఛేదనలో అమన్‌జోత్ కౌర్ చెలరేగడంతో శ్రీలంక టాపార్డర్ విఫలమైంది.

#### మలుపు తిప్పిన రానా

లంక ఓపెనర్ హాసినీ పెరీరా(0)ను డకౌట్ చేసిన అమన్‌జోత్.. ఆ తర్వాత డేంజరస్ విష్మీ గుణరత్నేను బౌల్డ్ చేసింది. ఓపెనర్ల వైఫల్యంతో కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ చమరి ఆటపట్టు(51), నీలాక్షి డిసిల్వా(48) ఆదుకున్నారు. వీళ్లిదరూ 50 ప్లస్ భాగస్వామ్యంతో భారత బౌలర్లను విసిగించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని స్నేహ్ రానా విడదీసింది.

ఆటపట్టును బౌల్డ్ చేసిన తను మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఆ తర్వాత సమరవిక్రమ(26), అనుష్కా సంజీవని(28)లు పోరాడినా రానా తిప్పేయడంతో లంక ఆలౌట్ అంచున నిలిచింది. ఈ ఆల్‌రౌండర్ అనుష్క వికెట్ తీయడంతో లంక 245 పరుగులకే కుప్పకూలింది. దాంతో, భారత జట్టుకు 97 పరుగుల భారీ విజయం సొంతమైంది.

## మే 16 నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లు..

### ఫైనల్ వేదిక మార్పు..!



**న్యూఢిల్లీ:** క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఐపీఎల్ 18వ సీజన్ త్వరలోనే తిరిగి ప్రారంభం కానుంది. భారత్, పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించడంతో తదుపరి మ్యాచ్‌ల నిర్వహణకు బీసీసీఐ సిద్ధమవుతోంది. మే 16వ తేదీ నుంచి లీగ్‌ను పునరుద్ధరించాలని బీసీసీఐ భావిస్తోంది. అందుకోసం త్వరలోనే కొత్త షెడ్యూల్ ప్రకటించనుంది. ఫైనల్ ఫైట్ మే 30న లేదంటే జూన్ 1 న జరగునందని సమాచారం. అయితే.. ముందగా నిర్ణయించినట్టు ఫైనల్ మాత్రం ఈడెన్ గార్డెన్స్‌లో జరగదనే వార్తలు వినిపిస్తున్నాయి.

సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్‌ను వారం రోజులు వాయిదా వేస్తున్నట్టే మే 9న బీసీసీఐ ప్రకటించింది. పరిస్థితులు ఇలానే కొనసాగితే లీగ్‌ను మొత్తానికే రద్దు చేయడం లేదా దక్షిణాది రాష్ట్రాలో నిర్వహించాలని భారత బోర్డు భావించింది. అయితే.. మే 10న ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దాంతో, మే 16, 17 నుంచి లీగ్‌ను జరిపేందుకు బీసీసీఐ సన్నాహకాలు చేస్తోంది. ఇదే విషయమై ఐపీఎల్ ఫ్రాంచైజీలకు సమాచారాన్ని ఇచ్చింది బీసీసీఐ.

'కాల్పుల విరమణ వార్త తెలియగానే ఐపీఎల్ చైర్మన్, బీసీసీఐ అధికారులు సమావేశం అయ్యారు. వాయిదా పడిన ఐపీఎల్ పునరుద్ధరణపై ఆదివారం సుదీర్ఘంగా చర్చించారు. ఫ్రాంచైజీలతో పాటు, బ్రాండ్‌కాస్టింగ్ సంస్థలతో మాట్లాడి కొత్త షెడ్యూల్‌ను ప్రకటిస్తాం. అందరూ కోరుకుంటున్నట్టే లీగ్‌ను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నాం' అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించాడు.

హైదరాబాద్‌లో క్వాలిఫయర్ 1

ఐపీఎల్ కొత్త షెడ్యూల్ వస్తే.. లక్నోలోని ఏక్‌నా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో క్రికెట్ పండుగ మళ్లీ అభిమానులను అలరించనుంది. హైదరాబాద్‌లో క్వాలిఫయర్ 1, కోల్‌కతాలో క్వాలిఫయర్ 2 జరిగే అవకాశముంది. మే 30 లేదా జూన్ 1 నిర్వహించే ఫైనల్‌తో విజేత ఎవరో తేలిపోనుంది. నాలుగు ప్లే ఆఫ్స్ బెర్తులకు 7 జట్లు పోటీపడుతున్న విషయం తెలిసిందే.

## ఆస్ట్రేలియా క్రికెట్‌లో విషాదం



### ట్రిపుల్ సెంచరీ హీరో కన్నుమూత

**సిడ్నీ:** ఆస్ట్రేలియా క్రికెట్‌లో విషాదం నెలకొంది. ఆ దేశ మాజీ క్రికెటర్ బాబ్ కౌపర్ కన్నుమూశాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 84 ఏళ్ల వయసులో తుది శ్వాస విడిచాడు. ఈ విషయాన్ని ఆదివారం వెల్లడించిన క్రికెట్ ఆస్ట్రేలియా దిగ్గజ ఆటగాడి మృతి పట్ల సంతాపం ప్రకటించింది.

'తొలి తరం క్రికెటర్ బాబ్ కౌపర్ మృతి చెందారనే విషయం తెలిసి ఎంతో చింతిస్తున్నాం. ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఆయనకు ఎంతో గౌరవమర్యాదలు ఉన్నాయి. బాబ్ అద్భుతమైన బ్యాటర్. ఇంగ్లండ్‌పై మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో ఆయన కొట్టిన ట్రిపుల్ సెంచరీ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 1960వ దశకంలో బాబ్ బ్యాటింగ్ అటు ఆసీస్‌తో పాటు విక్టోరియా జట్టు విజయాల్లో కీలకమైంది' అని క్రికెట్ ఆస్ట్రేలియా చైర్మన్ మైక్ బైర్డ్ తెలిపాడు.

లెఫ్ట్ హ్యాండర్ అయిన కౌపర్ దేశవాళీలో విక్టోరియా జట్టు తరఫున 66 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. 53.00 సగటుతో రాణించిన ఆయన 4,611 పరుగులతో సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. ఆస్ట్రేలియా జాతీయ జట్టు ఆటగాడిగా తనదైన విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించాడీ క్రికెటర్. అయితే.. 1966లో కౌపర్ ఇంగ్లండ్‌పై కొట్టిన ట్రిపుల్ సెంచరీ ఆయన కెరియర్‌కే హైలైట్.

మెల్‌బోర్న్‌లో 12 గంటలపాటు క్రీజులో నిలిచిన ఆయన.. ఇంగ్లీష్ బౌలర్లను విసిగిస్తూ 589 బంతుల్లో 307 పరుగులు బాదాడు. 20వ శతాబ్దంలో ఆసీస్ తరఫున టెస్టుల్లో మూడొందలు కొట్టిన రికార్డు ఇప్పటికీ కౌపర్ పేరిటే ఉంది. బాబ్ 1964 జూలై నుంచి 1968 జూలై మధ్య కాలంలో 27 టెస్టులు ఆడాడు. దంచికొట్టడమే తెలిసి ఆయన రికార్డు స్థాయిలో 2,061 రన్స్ సాధించాడు. ఆల్‌రౌండ్‌గా తన ముద్ర వేసిన కౌపర్ బంతితోనూ విజృంభించి 36 వికెట్లు పడగొట్టాడు. కౌపర్‌కు భార్య డేల్ కూతుళ్లు ఒలీవియా, సెరాలు ఉన్నారు.

## ఐపీఎల్ ఆడాలని మా క్రికెటర్లను ఒత్తిడి చేయం..

### ఆస్ట్రేలియా బోర్డు..!

**సిడ్నీ:** ఐపీఎల్ 18వ సీజన్ త్వరలోనే తిరిగి ప్రారంభం కానుండడం అభిమానులకు తీపి కబురే. కానీ, కొన్ని జట్లు మాత్రం కీలక ఆటగాళ్ల సేవల్ని కోల్పోయే అవకాశముంది. ముఖ్యంగా విదేశీ క్రికెటర్లు తదుపరి మ్యాచుల్లో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఎందుకంటే.. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల నడుమ ఆర్సీబీ, పంజాబ్, ఢిల్లీ జట్లకు చెందిన ప్లేయర్లు తమ దేశాలకు వెళ్లిపోయారు. ఇప్పుడు ఇండో -పాక్ కాల్పుల విరమణకు అంగీకరించడంతో తదుపరి మ్యాచ్‌ల నిర్వహణకు బీసీసీఐ సిద్ధమవుతోంది.

మే 16వ తేదీ నుంచి లీగ్‌ను పునరుద్ధరించాలని బీసీసీఐ భావిస్తోంది. అయితే.. ఇప్పటికే సొంత దేశాలకు వెళ్లిపోయిన క్రికెటర్లకు ఆయా బోర్డులు అనుమతి ఇస్తాయా? అనేది తెలియాల్సి ఉంది. ఐపీఎల్ పునరుద్ధరణ నేపథ్యలో క్రికెట్ ఆస్ట్రేలియా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'ఐపీఎల్ 18వ సీజన్‌లో ఆడుతున్న మా క్రికెటర్లు సురక్షితంగా స్వదేశం చేరుకున్నారు.

ఇప్పుడున్న పరిస్థితుల్లో వాళ్లను ఐపీఎల్ ఆడాల్సిందిగా మేము ఒత్తిడి చేయం. ఒకవేళ వాళ్లు భారత్‌కు వెళ్లేందుకు సిద్ధపడకుంటే వాళ్ల నిర్ణయాన్ని మేము గౌరవిస్తాం' అని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. పేసర్ మిచెల్ స్టార్క్, మార్కస్ స్టోయినిస్‌తో పాటు పలువురు ఆసీస్ ఆటగాళ్లు ఆదివారం సొంత గడ్డపై అడుగుపెట్టారు. ఒకవేళ ఆస్ట్రేలియా ప్లేయర్లు రిటర్న్ రాకుంటే.. తొలి టైటిల్‌పై కన్నేసిన ఆర్సీబీ, ఢిల్లీ, పంజాబ్ జట్లకు గట్టి ఎదురుదెబ్బ తగలడం ఖాయం. భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో ఆస్ట్రేలియా బోర్డు తమ ఆటగాళ్ల భద్రత గురించి ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.



# ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్‌లో శ్రద్ధా కపూర్!



టాకీస్: టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కేజీఎఫ్, సలార్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఎన్టీఆర్ నీల్ అంటూ రానున్న ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పటికే హైదరాబాద్‌లోని పలు లొకేషన్స్‌లో ప్రశాంత్ నీల్ కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాను వచ్చే ఏడాది (2026) సమ్మర్ కానుకగా.. జూన్ 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇదిలావుంటే ఈ సినిమాలో కథానాయికకు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. సెకండ్ ఆఫ్‌లో ఇంపార్టెంట్ రోల్‌లో శ్రద్ధా కపూర్ నటించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాను ఎన్టీఆర్ కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచేలా రూపొందించాలని పట్టుదలగా ఉన్నారు. అందుకే, స్క్రిప్ట్ విషయంలో ఆయన చాలా సమయం తీసుకున్నారని సమాచారం. ఇప్పటివరకు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన చిత్రాలన్నింటిలోకి 'డ్రాగన్' అత్యుత్తమంగా ఉంటుందని అభిమానులు అంచనా వేస్తున్నారు.

# డబ్బింగ్ షురూ..

## ప్రభాస్ 'ది రాజా సాబ్' నుంచి లేటెస్ట్ అప్‌డేట్



**టాకీస్:** పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం రాజా సాబ్. టాలీవుడ్ డైరెక్టర్ భలే భలే మొగాడివోయ్ ఫేమ్ మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు సమాచారం. అయితే ఈ మూవీ నుంచి తాజాగా ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

తాజా సమాచారం ప్రకారం, ప్రభాస్ వచ్చే వారం నుంచి తన పాత్రకు డబ్బింగ్ చెప్పడం ప్రారంభించనున్నట్లు తెలుస్తుంది. ప్రభాస్ అందుబాటులో ఉన్నంతసేపు అతడికోసం ప్రత్యేకంగా డబ్బింగ్ సెటప్‌ను కూడా ఏర్పాటు చేశారట. ప్రభాస్ మరికొన్ని రోజులు కేటాయిస్తే సినిమా షూటింగ్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తవుతాయని తెలుస్తోంది. అయితే షూటింగ్ ఆలస్యం అవ్వడం.. పోస్ట్ ప్రోడక్షన్ పనులు పెండింగ్ ఉండడంతో ఈ మూవీ విడుదల తేదీ ఎప్పుడు ప్రకటిస్తారా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. కాగా దీనిపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వవలసి ఉంది. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రిద్ధి కుమార్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.

# 'హిట్ 3' సక్సెస్ పార్టీ..

## ఒకేచోట కలిసిన టాలీవుడ్ యువ దర్శకులు



**టాకీస్:** టాలీవుడ్ యువ దర్శకులంతా ఒకేచోట కలిశారు. నాని హిట్ 3 సినిమా విజయం కావడంతో దర్శకుడు శైలేష్ కొలను గ్రాండ్ సక్సెస్ పార్టీ ఏర్పాటు చేశాడు. ఈ పార్టీకి తండేల్ దర్శకుడు చందు మొండేటితో పాటు అంటే సుందరానికి దర్శకుడు వివేక్ ఆత్రేయా, శ్యామ్ సింగరాయ్ దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్, పెద్ది దర్శకుడు బుచ్చిబాబు సానా, జాతిరత్నాలు దర్శకుడు కేవీ అనుదీప్, బేబీ దర్శకుడు సాయి రాజేష్, టక్ జగదీశ్ దర్శకుడు శివ నిర్వాణ, విశ్వంభర దర్శకుడు వశిష్ట తదితరులు ఈ వేడుకకు వచ్చి సందడి చేశారు.

ఎన్నో రోజులుగా కలవాలని అనుకుంటున్నాం, హిట్ 3 సినిమా విజయాన్ని మీతో పంచుకోవడం కంటే మంచి సందర్భం మరొకటి ఉండదు. నాకు బాగోలేనప్పుడు అండగా నిలిచిన ఈ వ్యక్తులతో నా సంతోషాన్ని పంచుకోవడం చాలా గొప్పగా ఉంది. మీకు తెలియకపోవచ్చు, కానీ మా తెలుగు చలన చిత్ర పరిశ్రమలోని దర్శకులందరం ఒకరితో ఒకరం టచ్‌లో ఉంటాం, ఒకరినొకరు చూసుకుంటాం, అందరం క్షేమంగా ఉన్నామో లేదో తెలుసుకుంటాం. మేము కలిసి సినిమాలు చేసుకుంటాం, ఇది మా కుటుంబం. అంటూ శైలేష్ రాసుకోచ్చాడు.

'హిట్- 3' (హిట్ : ది థర్డ్ కేస్) బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. శైలేష్ కొలను దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం ఇప్పటికే రూ.100 కోట్ల వసూళ్లను రాబట్టి రూ.150 కోట్ల దిశగా దూసుకెళుతుంది.

# బాక్సాఫీస్ వద్ద 'సింగిల్' ప్రభంజనం



## రెండు రోజుల్లోనే రికార్డు స్థాయి వసూళ్లు!

**టాకీస్:** టాలీవుడ్ నటుడు శ్రీ విష్ణు నటించిన తాజా కామెడీ చిత్రం 'సింగిల్' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. విడుదలైన రెండు రోజుల్లోనే ఈ చిత్రం భారీ వసూళ్లను రాబట్టింది. వీకెండ్ కావడంతో ఈ కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 'సింగిల్' చిత్రం మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.4.15 కోట్లు వసూలు చేయగా, రెండో రోజు ఏకంగా రూ.7.05 కోట్లు రాబట్టింది. దీంతో రెండు రోజుల్లో ఈ చిత్రం మొత్తం రూ.11.2 కోట్ల గ్రాస్ కలెక్షన్లను సాధించింది. ఈ కలెక్షన్లు శ్రీ విష్ణు కెరీర్‌లోనే అత్యధికంగా నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లో కూడా థియేటర్లు నిండుగా ఉండటంతో చిత్ర యూనిట్ ఆనందం వ్యక్తం చేస్తోంది. అమెరికాలో కూడా ఈ చిత్రం రెండు రోజుల్లో వి300 మార్క్‌ను దాటేసింది. వీకెండ్ ముగిసే నాటికి అర మిలియన్ డాలర్లను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 'బుక్ మై షో' ప్రకారం, విడుదలైన 24 గంటల్లోనే 80 వేలకు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. ఇదే జోరు కొనసాగితే, ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మరిన్ని రికార్డులు సృష్టించడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

కార్తిక్ రాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన కేతిక శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటించారు. గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిలిమ్స్ మరియు ఇతర నిర్మాణ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మించాయి. వెన్నెల కిశోర్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. కామెడీ సన్నివేశాలు, శ్రీ విష్ణు మరియు వెన్నెల కిశోర్‌ల మధ్య సంభాషణలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాస్, యూత్, ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమాను ఆదరిస్తున్నారు.

# సంతానం 'డెవిల్స్ డబుల్ నెక్ట్స్ లెవెల్' ట్రైలర్ విడుదల

**టాకీస్:** తమిళ నటుడు సంతానం నటించిన 'డెవిల్స్ డబుల్ నెక్ట్స్ లెవెల్' తెలుగు ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమా మే 16న విడుదల కాబోతుండగా.. 'డిల్లుకు దుడ్డు' సిరీస్‌లో రాబోతున్న నాల్గవ చిత్రం, ఈ సినిమాకు ఎస్.ప్రేమ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తుండగా.. గౌతమ్ వాసుదేవ్ మీనన్, సెల్వరాఘవన్, గీతికా తివారీ, యషికా ఆనంద్, కస్తూరి శంకర్, నిజల్గల్ రవి, మారన్, రాజేంద్రన్ వంటి నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ మూవీ నుంచి తెలుగు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.

ట్రైలర్ చూస్తుంటే.. సినిమాకు రివ్యూలు ఇస్తూ వాటిని ఫ్లాప్ చేస్తుంటాడు సంతానం. అయితే సంతానం రివ్యూ వలన నష్టపోయిన ఒక వ్యక్తి దెయ్యం అయ్యి అతడిపై పగబట్టి.. ఒక లూప్‌లో పడేస్తాడు. అయితే ఆ లూప్‌లో చిక్కుకుపోయిన సంతానం మొట్ట రాజేంద్రన్ బయటకి ఎలా వచ్చారు అనేది ఈ సినిమా కథని తెలుస్తుంది. కామెడీ హారర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ ప్రస్తుతం ఆకట్టుకుంటుంది. ఈ చిత్రాన్ని ఆర్యా 'ది షో పీపుల్' మరియు వెంకట్ బోయనపల్లి 'నిహారికా ఎంటర్‌టైన్‌మెంట్' బ్యానర్‌లపై నిర్మించారు.



# కిల్లింగ్ చూపులతో కవ్విస్తోన్న కయదు లోహర్..



## అమ్మడు జోరు ఇప్పట్లో ఆగేలా లేదుగా..

**టాకీస్:** కొందరు హీరోయిన్లు తమ కెరీర్‌లో ఎంత శ్రమించినా స్టార్‌డమ్ సంగతి పక్కనపెడితే కనీసం వాళ్ల కెరీర్ పైకి లేవదు. ఇండస్ట్రీలో నిలదొక్కుకావాలంటే టాలెంట్‌తో పాటు ఆవగింజం అదృష్టం కూడా ఉండాలని పెద్దలు అంటూ ఉంటారు. అయితే కొందరు మాత్రం ఒక్క సినిమాతోనే స్టార్‌డమ్ సంపాదిస్తుంటారు. ఈ కోవలోకే వస్తారు హీరోయిన్ కాయదు లోహర్. సింగిల్ మూవీతో ఈమె స్టార్‌డమ్ అందుకున్నారు. ప్రెజెంట్ యూత్ క్రష్ కాయదు లోహర్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అవసరం లేదు.. ఈ ముద్దుగుమ్మ 2000 ఏప్రిల్ 11న అస్సాంలోని తేజ్‌పూర్‌లో జన్మించింది 2021లో పూణే ఫ్రెష్ ఫేస్ కాంపిటీషన్‌లో విజేతగా నిలిచింది కాయదు లోహర్, ఇదే ఆమెకు సినిమా అవకాశాలను తెచ్చిపెట్టింది. 2021లో కన్నడ చిత్రం "మొగిల్‌పేట"తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. "పాథోన్‌పథం నూట్టండు" (2022) చిత్రంతో మలయాళంలో సూపర్ హిట్ అందుకుంది.

తాజాగా వచ్చిన డ్రాగన్ సినిమాతో బాగా పేరు తెచ్చుకుంది. ఈ చిత్రంలో కాయదు గ్లామర్ తో కుర్రకారు గుండెల్లో సెగలు రేపింది. ప్రస్తుతం తెలుగు, మరాఠీ, తమిళ్ చిత్రాల్లో బిజీ అయ్యిపోయింది. "థారం" మరియు "ఇధయం మురళి" వంటి చిత్రాలతో మరింత బిజీగా ఉంది ఈ ముద్దుగుమ్మ.

తెలుగులో విశ్వక్‌సేన్ అనుదీప్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న సినిమాలోనూ కాయదు లోహర్ హీరోయిన్‌గా ఎంపికైందని వార్తలు వస్తున్నాయి. కోలీవుడ్ సీనియర్ హీరో శింబు 49వ చిత్రంలోనూ ఆమె హీరోయిన్‌గా ఛాన్స్ కొట్టేశారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.